ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి
జిల్లా వార్తలు

5★

మంగళవారం 6 మే 2025

నిబంధనల ప్రకారం ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలు అమలు

- కలెక్టర్ కోయ శ్రీ హర్ష
- ఈనెల19 వరకు ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సుల నిర్వహణ
- నిర్ణీత సమయంలో యువ వికాసం అర్హుల ఎంపిక
- చివరి గింజ వరకు నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేస్తాం
- 10వ తేదీ వరకు ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల జాబితా



మాట్లాడుతున్న కలెక్టర్

పెద్దపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ నిబంధనల ప్రకారం ప్రాధాన్యత కార్యక్రమాలను కట్టుదిట్టంగా అమలు చేస్తున్నామని కలెక్టర్ కోయ శ్రీ హర్ష తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో ప్రభుత్వ ప్రాధాన్యత కార్యక్రమాలపై విలేకరుల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ కోయ శ్రీహర్ష ప్రభుత్వం ప్రవేశపెట్టిన పలు అంశాలపై వివరించారు.

భూభారతి: నూతన ఆర్వోఆర్ చట్టంపై సుల్తానాబాద్ మండలం మినహా అన్ని మండలాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు. జిల్లాలో ఈనెల 5 నుంచి 19 వరకు ఎలిగేడు మండలంలో రెవెన్యూ సదస్సులు నిర్వహించి భూ భారతి చట్టం కింద దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, దరఖాస్తులను జూన్ 2 వరకు పరిష్కరించేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. కోర్టు కేసులు, కుటుంబ వివాదాల సమస్యలు మినహాయించి మిగిలిన వాటిని భూ భారతి చట్టం వినియోగించి పరిష్కరిస్తామన్నారు. రోజు రెవెన్యూ సదస్సులో ఎన్ని దరఖాస్తులు వస్తున్నాయో సమగ్ర రికార్డు నిర్వహిస్తున్నామని, ఆర్ఎస్ఆర్, అసైన్మెంట్ సమస్యలు, సాదాబైనామా దరఖాస్తులు వివిధ రకాల భూ సమస్యలను పరిష్కరిస్తామని కలెక్టర్ తెలిపారు.

రాజీవ్ యువ వికాసం: జిల్లాలో మొత్తం 47 వేల దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. ప్రభుత్వం కొంత మేర సబ్సిడీ, బ్యాంకు లింకేజీ కలిపి యువ వికాసం యూనిట్ గ్రౌండ్ చేయాల్సి ఉంటుందని, ఎన్.పి.ఏ ఉన్న దరఖాస్తుదారులు, సిబిల్ స్కోర్ తక్కువగా ఉన్న, ఐదు సంవత్సరాలలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ కార్పొరేషన్ల నుంచి యూనిట్లు పొందిన దరఖాస్తులను మినహాయిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన సమయంలోగా దరఖాస్తుల ధ్రువీకరణ పూర్తి చేస్తామని, రాష్ట్రం నుంచి జిల్లాకు యువ వికాసం నిధుల కేటాయింపు జరగగానే మండలాల వారీగా కేటాయింపులు చేసి అర్హుల తుది జాబితా తయారు చేస్తామన్నారు.

ధాన్యం కొనుగోలు : యాసంగి సీజన్‌లో జిల్లాలో 3.5 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యంగా 334 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి ఇప్పటి వరకు 13 వేల 573 రైతుల నుంచి 240 కోట్ల విలువ చేసే లక్ష వేల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేశామని, రైతులకు 154 కోట్ల ధాన్యం డబ్బులు చెల్లించామని కలెక్టర్ తెలిపారు. సన్న రకం ధాన్యం కొనుగోలులో ఉన్న సమస్యలను పరిష్కరించామని, ఇప్పటివరకు ఐదువేల మెట్రిక్ టన్నుల సన్నరకం కొనుగోలు చేశామన్నారు. జిల్లాలో ఎటువంటి డిఫాల్ట్ లేని 105 రైస్‌మిల్లులకు ముందుగా ధాన్యం కేటాయింపులు చేశామని, రైస్ మిల్లర్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ఎటువంటి ఇబ్బందులు లేకుండా కొనుగోలు ప్రక్రియ జరిగేలా చూస్తున్నామన్నారు. నాణ్యత ప్రమాణాలు ఉన్న చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వాహనాల కొరత లేకుండా చర్యలు తీసుకున్నామని, అవసరమైన హమాలీలను బీహార్ నుంచి రప్పించామన్నారు.

ఇందిరమ్మ ఇండ్లు : జిల్లాలో పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేసిన గ్రామాలలో 1940 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేయగా, 700 ఇండ్లు గ్రౌండ్ చేశామని, బేస్మెంట్ వరకు పూర్తి చేసుకున్న 150 ఇండ్లకు ప్రభుత్వం నిధులు విడుదల చేసిందని, ప్రతీ సోమవారం నిర్మాణ పనుల పురోగతి ప్రకారం నిధులు విడుదల అవుతున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈనెల 10వ తేదీ వరకు జిల్లాలో ప్రతీ అసెంబ్లీ నియోజకవర్గానికి 3500 చొప్పున (పైలెట్ ప్రాజెక్టులో మంజూరు చేసిన మినహాయించి) లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసేందుకు కార్యాచరణ అమలు చేస్తున్నామన్నారు. ఇందిరమ్మ కమిటీలు ఎంపిక చేసి అందించిన లబ్ధిదారుల జాబితాను అధికారులు మరోసారి వెరిఫై చేస్తున్నారని తెలిపారు. అనంతరం జిల్లా ఇన్‌చార్జి మంత్రి ఆమోదంతో మంజూరు పత్రాలు పంపిణీ చేసి గ్రౌండ్ చేస్తామని కలెక్టర్ తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలు ఎక్కడైనా అనర్హులకు కేటాయించినట్లు తెలిస్తే వాటిని రద్దు చేసే అధికారం జిల్లా యంత్రాంగానికి ఉందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పనులు పర్యవేక్షించేందుకు ప్రతీ మండలానికి ప్రభుత్వం అసిస్టెంట్ ఇంజనీరు కేటాయిస్తుందని కలెక్టర్ తెలిపారు.

జిల్లాలో స్వల్ప భూకంపం

పెద్దపల్లి టౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో సోమవారం సాయంత్రం స్వల్ప భూకంపం చోటు చేసుకుంది. సుమారు 5 సెకండ్లపాటు భూమి కంపించింది. దీంతో ప్రజలు భయాందోళనకు గురయ్యారు. ఇంట్లో వస్తువులు కిందపడ్డాయి. పెద్దపల్లి, రామగుండం, గోదావరిఖని, సుల్తానాబాద్ ధర్మారం, పాలకుర్తి, కమాన్‌పూర్, తదితర మండలాల్లో భూమి కంపించింది. ఈ భూకంపం కొమురంభీం ఆసిఫాబాద్ జిల్లాలో కేంద్రీకృతమైం రిక్టర్ స్కేల్ పై 3.8గా నమోదైంది. దీని ప్రభావం 260 కిలోమీటర్ల దూరం వరకు ఉంది. ఎక్కడ కూడా ప్రాణ, ఆస్తి నష్టం జరగలేదు.

సుల్తానాబాద్: సుల్తానాబాద్ పట్టణంతోపాటు పలు గ్రామాలలో స్వల్పంగా భూమి కంపించింది. ఇంట్లోని సామాన్లు కిందపడడంతో మహిళలు ఉలిక్కిపడ్డారు. భూకంపంగా భావించి ప్రజలు ఇండ్ల నుంచి బయటకు పరుగులు తీశారు. పూసాల రోడ్డు, తహసిల్దార్ కార్యాలయం, గడిమహల్, పాతజెండా రజకనగర్ ప్రాంతాలలో ప్రజలు గుర్తించారు. తాను గోడకు ఒరిగి ఉండడంతో ఒక్కసారిగా గోడలు కదిలాయని గుర్తించానని తాడూరి వినోద అనే మహిళ తెలిపింది.

పెద్దపల్లి రూరల్, పాలకుర్తి, ధర్మారం: మండలంలోని పలు గ్రామాల్లో భూమి కంపించినట్లు ప్రజలు పేర్కొన్నారు. కొన్ని సెకన్లపాటు భూమి కంపించగా ఇండ్ల నుంచి బయటకు పరు గులు తీసినట్లు తెలిపారు. రాగినేడు, కనగర్తి, అప్పన్నపేట, బ్రాహ్మణపల్లి, కుర్మపల్లి, పెద్దబొంకూరు గ్రామాల్లో ఇళ్లపై రేకులు శబ్దం అయినట్లు ప్రజలు తెలిపారు.

రామగిరి మండలంలోని కల్వచర్ల, నవాబ్‌పేట్, బేగంపేట్ గ్రామంలో స్వల్పంగా కంపించినట్లు స్థానికులు గుర్తించారు.

ధర్మారం మండల కేంద్రంలో దుకాణంలోని సామగ్రి కింద పడిపోయాయి.

స్థానిక సంస్థల ఎన్నికలపై అయోమయం

- ఎటూతేల్చని రాష్ట్ర ప్రభుత్వం
- జనాభా లెక్కలతో కులగణన
- చేపడతామన్న కేంద్రం
- రిజర్వేషన్లపై తకరారు
- గ్రామాల్లో కుంటుపడుతున్న అభివృద్ధి
- పార్టీలో పెరుగుతున్న ఒత్తిడి



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై అయోమయం నెలకొన్నది. కేంద్ర ప్రభుత్వం ఇటీవల జనాభా లెక్కలతోపాటు కులగణన చేపడతామని ప్రకటించిన విషయం తెలిసిందే. రిజర్వేషన్ల విషయమై ఇప్పటి వరకు ఎన్నికలు వాయిదా పడుతుండగా, వాటి గురించి ప్రభుత్వం ఏమి తేల్చకపోవడంతో అయోమయం నెలకొన్నది. సకాలంలో ఎన్నికలు నిర్వహించకపోవడంతో అధికార పార్టీకి చెందిన నేతలతోపాటు ఇతర పార్టీల నేతలు అసహనానికి గురవుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికలు త్వరితగతిన నిర్వహించాలని అధికార పార్టీకి చెందిన నాయకులు ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకు వస్తున్నారు. ఎన్నికలు నిర్వహించని కారణంగా కేంద్ర ప్రభుత్వం నుంచి గ్రామపంచాయతీలకు రావాల్సిన నిధులు రాకపోవడంతో గ్రామాల్లో అభివృద్ధి కుంటుపడుతోంది. దీంతో రాష్ట్ర ప్రభుత్వానికి చెడ్డ పేరు వస్తున్నదని ఆ పార్టీకి చెందిన నేతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీల పదవీకాలం గతేడాది ఫిబ్రవరి మొదటి వారంలో ముగియగా, మండల, జిల్లా పరిషత్తు పాలకవర్గాల పదవీకాలం జూన్, జూలైలో ముగిసింది. అలాగే మున్సిపాలిటీల పాలకవర్గాల పదవీకాలం కూడా ఈ ఏడాది జనవరిలో ముగిసింది. ప్రస్తుతం ప్రత్యేక అధికారుల పాలనలో స్థానిక సంస్థలు కొన సాగుతున్నాయి. 2023లో జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్ని కల సందర్భంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చిన విషయం తెలిసిందే. ఆ మేరకు అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ స్థానిక సంస్థల ఎన్నికలను సకా లంలో నిర్వహించకపోగా, గత ఏడాది అక్టోబర్, నవంబర్‌లో కులగణన చేపట్టింది. దీంతోపాటు విద్య, ఉద్యోగ, ఉపాధి, ఆర్థిక స్థితిగతుల గురించి కూడా సర్వే చేపట్టారు. సర్వేను పూర్తి చేసిన ప్రభుత్వం రాష్ట్రంలో బీసీలే అధికంగా ఉన్నారని తేల్చింది. ఆ సర్వే నివేదికను అసెంబ్లీ వేదికగా ప్రభుత్వం ప్రకటించింది. అంతేకాకుండా సర్వేకు చట్టబద్ధత కల్పిస్తూ విద్య, ఉపాధి, ఉద్యోగ, రాజకీయపరంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించాలని నిర్ణయం తీసుకుంది. ఆ మేరకు ఆ బిల్లును ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వానికి పంపించింది. అయితే దీనిపై కేంద్ర ప్రభుత్వం ఏమి తేల్చకపోగా, దేశవ్యాప్తంగా జనాభా లెక్కలతోపాటు కులగణన చేపట్టాలని ఇటీవల జరిగిన కేంద్ర క్యాబినెట్ సమావేశంలో నిర్ణయం తీసుకుంది. జనాభా లెక్కలు ఇప్పట్లో పూర్తయ్యే అవకాశాలు కనబడకపోగా, మరోసారి స్థానిక సంస్థల ఎన్నికల అంశం రాష్ట్రంలో తెరపైకి వచ్చింది. రాష్ట్రంలో చేపట్టిన కుల గణన సర్వే నివేదికను కేంద్రానికి పంపించిన ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వం తీసుకునే నిర్ణయం కోసం ఎదురుచూస్తూ వస్తున్నది. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం చాకచక్యంగా జనాభా లెక్కలతోపాటు కులగణన చేపడతామని ప్రకటించింది. అయితే కేంద్ర ప్రభుత్వం ఆ లెక్కలు తేల్చే వరకు స్థానిక సంస్థల ఎన్నికల నిర్వ హణను ఆపడం సాధ్యమయ్యే పరిస్థితి కనబడడం లేదు. దీంతో తక్షణమే ఎన్నికలను నిర్వహించాల్సిన గత్యంతరం రాష్ట్ర ప్రభుత్వానికి ఏర్పడింది.

విడుదల కానీ 15వ ఆర్థిక సంఘం నిధులు

జిల్లాలో 266 గ్రామపంచాయతీలు ఉండగా వాటిలో ప్రత్యేక అధికారుల పాలన కొనసాగుతున్నది. ఎన్నికలు నిర్వహించని కారణంగా 2024-25 సంవత్సరానికి, ఈ ఆర్థిక సంవత్సరానికి రావలసిన 15వ ఆర్థిక సంఘం నిధులు రాకుండా పోతున్నాయి. ఎన్నికల నిర్వహిస్తేనే ఈ నిధులను కేంద్ర ప్రభుత్వం విడుదల చేస్తుందని కేంద్రం ప్రకటించింది. అయితే రాష్ట్ర ప్రభుత్వం ఇవ్వా ల్సిన స్టేట్ ఫైనాన్స్ నిధులు ఇవ్వకపోవడంతో గ్రామ పంచాయతీలను నిర్వహించడంలో గ్రామ కార్యద ర్శులు, ప్రత్యేక అధికారులు

(మిగతా 8వ పేజీలో)

రైతుల సంక్షేమానికి కృషి చేస్తున్న ప్రభుత్వం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): రైతుల సంక్షేమానికి ప్రభుత్వం పాటుపడుతుందని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. కూనారం వ్యవసాయ పరిశోధన స్థానం ప్రొఫెసర్ జయశంకర్ విశ్వ విద్యాలయం ఆధ్వర్యంలో ఉషన్నపల్లె గ్రామంలో సోమవారం రైతుల ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అన్ని రకాల పంటలు కూరగాయలు పండిస్తారన్నారు. శాస్త్రవేత్తలు సూచించిన విషయాలను రైతులు పాటించాలన్నారు. సేంద్రియ ఎరువులు వాడితే రైతులకు రోగాలు దరిచేరవు అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రైతు రుణమాఫీతో పాటు బోనస్, ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. నియోజకవర్గంలో 75 శాతం మంది రైతులకు రుణమాఫీ జరిగిందన్నారు. సోషల్ మీడియాలో బీఆర్ఎస్ నాయకులు ఫేక్ వీడియోలు పెడుతున్నారన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉండగా ఎవరికి రుణమాఫీ కాలేదన్నారు. ఏ రాష్ట్రంలో ఇవ్వని సన్న బియ్యం సీఎం రేవంత్ రెడ్డి ఇస్తున్నారన్నారు. త్వరలో రేషన్ కార్డులు కూడా ప్రభుత్వం అందజేస్తుందన్నారు. ప్రభుత్వం నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు చేస్తే ఉషన్నపల్లె ప్రత్యేక గ్రామపంచాయతీ అవుతుందని హామీ ఇచ్చారు. జిల్లా వ్యవసాయ అధికారి ఆదిరెడ్డి, మాజీ ఎంపీపీ గోపగోని సారయ్య గౌడ్, వ్యవసాయ మార్కెట్ చైర్మన్ రామిడి తిరుపతిరెడ్డి, శాస్త్రవేత్తలు శ్రీధర్, మధుకర్ రావు, హార్టికల్చర్ అధికారి సురేష్, వెటర్నరీ డాక్టర్ సురేష్, ఏవో నాగార్జున, రైతులు పాల్గొన్నారు.

రసాయనిక ఎరువులతో భూసారం తగ్గుతుంది

రసాయనిక ఎరువులతో భూసారం తగ్గుతుందని శాస్త్రవేత్త మధుకర్ రావు అన్నారు. రైతులకు ఆయన అవగాహన కల్పించారు. వరి పంటతోపాటు ప్రత్యా మ్నాయ పంటలు వెయాలన్నారు. ప్రభుత్వం పచ్చి రొట్టెకు సబ్సిడీ ఇస్తుందన్నారు. రైతులు భూమి బలంగా ఉండాలంటే సేంద్రియ ఎరువులను ఎక్కువగా వాడాలన్నారు.

భూసమస్యలపై దరఖాస్తులు సమర్పించాలి



ఎలిగేడు భూభారతి రెవెన్యూ సదస్సులో కలెక్టర్ శ్రీహర్ష

ఎలిగేడు, మే 5 (ఆంధ్రజ్యోతి): భూభారతి రెవెన్యూ సదస్సులను ప్రజలు వినియోగించుకోవాలని, సమస్యలపై దరఖాస్తులు సమర్పించాలని కలెక్టర్ కోయ శ్రీహర్ష అన్నారు. మండల కేంద్రంలోని గ్రామపంచాయతీలో, బుర్హాన్‌మియాపేటలో నిర్వహిస్తున్న భూభారతి రెవెన్యూ సదస్సులను కలెక్టర్ కోయ శ్రీహర్ష సోమవారం పరిశీలించారు. భూసమస్యలు ఉన్నవారు తమ దరఖాస్తులను రెవెన్యూ సదస్సులలో అందించాలని, భూభారతి చట్టం ప్రకారం పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అనంతరం మండల కేంద్రంతో పాటు ధూళికట్ట, బుర్హాన్‌మియాపేటలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ పరిశీలించారు. చివరి గింజ వరకు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదన్నారు. శివపల్లిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను కలెక్టర్ పరిశీలించారు. ఇండ్లు త్వరగా గ్రౌండ్ చేసుకొని పనులు ప్రారంభించాలని, బేస్మెంట్ వరకు పూర్తిచేసుకున్న ఇళ్లకు లక్ష రూపాయలు విడుదల చేస్తుందని తెలిపారు. ధూళికట్ట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అభివృద్ధి పనులు పూర్తిచేయాలని అధికారులకు సూచించారు. ఇన్‌చార్జి ఆర్డీవో సురేష్, తహసీల్దార్ బషీరుద్దీన్, అడిషనల్ డీఆర్‌డీఓ రవికుమార్, ఎంపీడీఓ భాస్కర్‌రావు, డిప్యూటీ తహసీల్దార్ కిరణ్‌కుమార్, పాల్గొన్నారు.

ఆర్టీసీ సమ్మె పోస్టర్ ఆవిష్కరణ

మంథని, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్టీసీ సంస్థలో పని చేస్తున్న కార్మికుల డిమాండ్ల సాధన కోసం ఈనెల 7వ తేదీ నుంచి ప్రారంభమయ్యే సమ్మెకు సంబంధించిన వాల్ పోస్టర్‌ను జేఏసీ నేతలు డిపో ఆవరణలో సోమవారం అవిష్కరించారు. జేఏసీ కమిటీ ఏర్పాటు చేసుకున్నారు. చైర్మన్‌గా వీ.ఐలయ్య, కన్వీనర్‌గా కేకే రెడ్డి, సహాయ కన్వీనర్లుగా కృష్ణ, జనార్దన్, ఖుతుబుద్దీన్, కేఆర్ రావు, అబ్బా శివదర్శన్, పోచయ్య, జేడీ నాయక్, ఇంతియాజ్‌బేగం, జేఏసీ సీవో చైర్మన్‌గా ఎడ్ల రమేష్, కోశాధికారిగా మునీర్, ప్రచార కార్యదర్శులుగా రాజు, విజేందర్, రాజయ్య, గోపాల్, కుమార్‌లు ఎన్నికయ్యారు.

సన్న ధాన్యం కొనుగోలు చేయాలని ధర్నా



ధర్నా చేస్తున్న బీజేపీ నాయకులు

పెద్దపల్లిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): సన్న ధాన్యం కొనుగోలు చేయాలని బీజేపీ ఆధ్వర్యంలో సోమవారం వ్యవసాయ మార్కెట్ ఎదుట ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ ఐకెపి సెంటర్లు ప్రారంభించి నెల రోజులు గడిచినా ప్రభుత్వం సన్న వడ్లు కొనుగోలు చేయడం లేదన్నారు. సన్న వడ్లకు రూ.500 బోనస్ ఇస్తామని చెప్పి రైతులను మోసం చేశారన్నారు. ఇటీవల కురిసిన వడగండ్ల వానకు నియోజకవర్గంలో వందలాది ఎకరాల పంటను నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లిస్తానని చెప్పిన రాష్ట్ర ప్రభుత్వం ఒక్క రైతుకు చెల్లించలేదన్నారు. పెంజర్ల రాకేష్ రమేష్ శిలారపు పర్వతాలు తంగడ రాజేశ్వరరావు, పోల్సాని సంపత్, మేకల శ్రీనివాస్ కావేటి రాజగోపాల్ వొళ్లే తిరుపతి రాజమంతకృష్ణ ఎర్రోళ్ల శ్రీకాంత్ పడాల శ్రీధర్ ఆడెపు రమేష్ గుడ్ల సతీష్ తదితరులున్నారు.

కులగణనతో బీసీలకు న్యాయం



- రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి...
- తెలంగాణలో జరిగింది కుల గణన సర్వే...
- కేంద్రం చేసేది కుల గణన...
- రాజీవ్ రహదారి కాంట్రాక్టు గడువు పొడిగింపునకు యత్నిస్తే వ్యతిరేకిస్తా
- తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12లక్షల కోట్లు ఇచ్చింది...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

7

ఆదివాసీ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- నా విప్లవ బంధం తెగిపోయినా ఆదివాసి బంధం తెగిపోలేదు
- హింసను ప్రేరేపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాహుల్ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన

7

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం

- బేస్‌మెంట్ లెవెల్‌లో 13 ఇళ్లు, 29 నిర్మాణ దశలో..
- మొదటి విడతలో లబ్ధిదారుడికి లక్ష చెక్కు అందజేత

పెద్దపల్లి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలులో భాగంగా పెద్దపల్లి మండ లంలో పనులు వేగవంతమయ్యాయి. ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలుకు మండలంలోని నిమ్మనపల్లి గ్రామాన్ని పైలట్ ప్రాజెక్టు కింద ప్రభుత్వం ఎంపిక చేసింది. గ్రామంలో 153 ఇళ్లు మంజూరు కాగా ఇందులో 42 ఇళ్ల నిర్మాణాలు ప్రారంభించారు. ప్రస్తుతం 13 ఇళ్ల వరకు బేస్‌మెంట్ లెవల్ నిర్మాణం కాగా అందులో లబ్ధిదారుడైనా తూముల శ్రీనివాస్‌కు మొదటి విడతలో రూ.లక్ష చెక్కును కలెక్టర్, ఎమ్మెల్యే విజయరమణారావు అందజేశారు. దీంతో గ్రామంలో మిగతా ఇళ్ల నిర్మాణంలో వేగం పుంజుకుంది. ఇళ్ల నిర్మాణాల పర్య వేక్షణకు పిడి, ఎంపీడీవోతోపాటు గ్రామ కార్య దర్శి, ఇందిరమ్మ కమిటి సభ్యులతో పాటు పలు విభాగాల ప్రతినిధులు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నారు. మిగతా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులను ఎంపిక చేసే అవకాశాలు ఉన్నాయి. ఈ మేరకు గ్రామంలో నాణ్యతతో కూడిన ఇళ్ల నిర్మాణం ప్రభుత్వ నమూనా ఆధారంగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం రూపుదిద్దుకుం టున్నాయి. ఇందులో భాగంగా కలెక్టర్ ప్రత్యేక పర్యవేక్షణలో పైలట్ ప్రాజెక్టు పూర్తి చేయనున్నారు.

4 విడతల్లో బిల్లుల చెల్లింపులు

నిమ్మనపల్లి గ్రామాన్ని ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేయగా అందులో



గోడల వరకు పూర్తయిన ఇందిరమ్మ ఇల్లు

ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు 153 మంది లబ్ధిదారులను ఎంపిక చేసింది. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు 42 మంది పనులు ప్రారంభించారు. ఇందులో 13 ఇళ్లు బేస్‌మెంట్ లెవెల్ రాగా , మిగతా ఇళ్లు ముగ్గు పోసిన దశలోనే ఉన్నాయి. గ్రామానికి చెందిన తూముల శ్రీనివాస్ అనే లబ్ధిదారుడు ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం బేస్‌మెంట్ లెవెల్ పూర్తి చేసుకోగా అతనికి లక్ష చెక్కును మొదటి విడతలో అందించారు. ఇళ్ల నిర్మాణాలు పూర్తయ్యే వరకు నాలుగు విడతల్లో బిల్లులు చెల్లించ నున్నారు. బేస్‌మెంట్ లెవెల్ పూర్తి చేసుకొని గోడలు, స్లాబ్ వరకు పూర్తి చేసుకోగా రెండో విడతలో మరో లక్ష అందించనుంది. మూడో విడతలో రూ.2 లక్షలు అందిచనున్నారు. చివరగా ఇళ్లకు రంగులు, ఇతర పనులు పూర్తయ్యాక రూ. లక్ష చెల్లించనున్నారు. ఈవిధంగా నాలుగు విడతల్లో బిల్లులను ప్రభుత్వం చెల్లించనుంది.

ఇళ్ల నిర్మాణాలను నిరంతరం పర్యవేక్షిస్తున్నాం

- కొప్పుల శ్రీనివాస్, ఎంపీడీవో ,పెద్దపల్లి



పైలట్ ప్రాజెక్టు కింద నిమ్మనపల్లి గ్రామానికి ఎంపిక చేయగా గ్రామంలో లబ్ధిదారులు చేపట్టిన ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేసేలా పర్యవేక్షిస్తున్నాం. నిర్మాణాల్లో నాణ్యత ప్రమాణాలు పాటించే విధంగా వారికి సూచిస్తున్నాం. ప్రారంభించని వారికి సలహాలు, సూచనలు ఇస్తూ పనులు త్వరగా ప్రారంభించాలని తెలుపుతున్నాం.

నకిలీ మందులు అమ్ముతున్న వ్యక్తిని పట్టుకున్న గ్రామస్థులు

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్ర జ్యోతి): ఆశన్నపల్లె గ్రామపంచాయతీ కార్యాలయంలో నకిలీ మందులు అమ్ముతున్న కొంకటి రమేష్ అనే వ్యక్తిని సోమవారం గ్రామస్థులు పటు కున్నారు. ఈ విషయంపై మెడికల్ సిబ్బందికి సమాచారం అందించగా కూనారం ప్రభుత్వ ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ డాక్టర్ భావన ఆశన్నపల్లెలో మందులు పరిశీలించారు.డాక్టర్ భావన మాట్లాడుతూ ఆశన్నపల్లి గ్రామపంచా యతీలో సంజీవని నేషనల్‌కేర్ సెంట ర్‌కు సంబంధించిన కొంకటి రమేష్ ఎక్స్‌పైరీ అయిపోయిన మందులను గ్రామస్థులకు అమ్ముతున్నాడని తెలి పారు. ఈ మందులు వాడటం వల్ల సైడ్ఎఫెక్ట్స్ కూడా ఉంటాయన్నారు.

గ్రామ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి..

గ్రామకార్యదర్శిపై చర్యలు తీసుకో వాలని మాజీసర్పంచ్ మంద రమ వెంకన్న, గాజుల మోహన్, కూస రవి, ఎరుకల మల్లయ్య తదితరులు డాక్టర్ కు వినతిపత్రంలో పేర్కొన్నారు. కార్య దర్శి సంజీవ్ గ్రామంలో ఊరు చాటిం పు వేయించి గ్రామపంచాయతీలోనే మెడికల్ క్యాంపు నిర్వహించిన కార్య దర్శిపై చర్యలు తీసుకోవాలన్నారు. ఈమందులు ఇచ్చే అతను పరీక్షలకు 200రూపాయలు, మందులకు 1000 నుంచి 1200రూపాయలు వసూలు చేశాడని ఈవిషయంపై జిల్లా కలెక్టర్ స్పందించాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వేములవాడ టౌన్, మే 5 (ఆంధ్ర జ్యోతి): ఆర్టీసీ, బస్సు ద్విచక్ర వాహం ఢీకొన్న సంఘటనలో ఒకవ్యక్తి తీవ్రగా యాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాలప్రకారం.. కోనరావుపేట మండ లం బావుసాయిపేట గ్రామానికి చెందిన రాజు తన ద్విచక్రవాహనంపై సిరిసిల్లకు వెళుతుండగా డివైడర్‌ను ఢీకొని ఎదురుగా సిరిసిల్ల నుంచి వేములవాడకు వస్తున్న బస్సుకు ఢీకొన్నాడు. ఈ సంఘటనలో రాజుకు తీవ్రగాయాలు కావడంతో కరీంనగర్ ఆసుపత్రికి తరలించినట్లు స్థానికులు తెలిపారు.

ఒకరికి రెండు రోజుల జైలు శిక్ష

జగిత్యాల అర్బన్, మే 5 (ఆంధ్ర జ్యోతి): జగిత్యాల కేంద్రంలో కొన్ని రోజుల క్రితం పోలీసులు నిర్వహించిన డ్రంక్ అండ్ డ్రైవ్‌లో పట్టుబడ్డ వ్యక్తికి స్పెషల్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కరు ణాకర్ రెండు రోజులజైలు శిక్ష విధిం చారు. కొన్నిరోజుల క్రితం పట్టణంలో డ్రంకెన్‌డ్రైవ్ నిర్వహించగా వరికొప్పుల పరషురాం అనే వ్యక్తి పట్టుబడగా పట్టణ ఇన్‌స్పెక్టర్ వెణుగోపాల్ అతనిని కోర్టులో ప్రవేశపెట్టగా మెజిస్ట్రేట్ రెండు రోజుల శిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు..


వేసవి సెలవులు సద్వినియోగం చేసుకోండిలా

వేసవి సెలవులంటే పిల్లలకు చాలా ఇష్టం. పది నెలలుగా ప్రతి రోజు పుస్తకాలతో కుస్తీ పట్టిన విద్యార్థులంతా ఆటలు ఆడుతూ పాటలు పడుతూ కాలక్షేపం చేస్తు ఆనందంగా గడుపుతారు. వివిధ రకాల ఆటలు ఆడుతూ ఎంజాయ్ చేస్తుంటారు. గ్రామీణ ప్రాంతాల్లో పిల్లలు ఈత కోసం చెరువులు, బావుల దగ్గర హంగామా చేస్తారు. పట్టణాల్లో పిల్లలు స్విమ్మింగ్‌పూల్‌కు బాట పడుతున్నారు. నృత్యంలో శిక్షణ తీసుకునేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. కొంత మంది పిల్లలు కంప్యూటర్ నేర్చుకుంటున్నారు. వేసవిలో చిన్నారులు నేర్చుకునే అంశాలపై 'ఆంధ్రజ్యోతి' కథనం..

- చొప్పదండి,ఆంధ్రజ్యోతి

ఇష్టమైన రంగాల్లో రాణించేందుకు శిక్షణ





ఖోఖోతో వ్యాయామం

ఖోఖో ఆటలో పరిగెత్తడం ద్వారా రక్త ప్రసరణ బాగా జరుగుతుంది. ఆటలో క్రీడాకారుల సంఖ్య ఎక్కువగా ఉండటంతో మిత్రులతో స్నేహభావం పెరుగుతుంది. సంపూర్ణ ఆరోగ్యంగా ఉండడానికి ఈ గ్రామీణ క్రీడ ఎంతో దోహదపడుతుంది. వాలీబాల్ ఆటతో శరీరంలో అన్ని అవయవాలు కదులుతాయి. కాళ్లకు చేతి కండరాలకు పని చేప్పే ఆట. వాలీబాల్ అందరికి మంచి వ్యాయామాన్ని అందించే ఆట.

గ్రామీణ ఆట కబడ్డీ

గ్రామీణ ఆటలలో కబడ్డీది ప్రత్యేక స్థానం. ఈ ఆటతో శరీరక దృఢత్వం పెరగ డంతోపాటు రక్తప్రసరణ వృద్ధి చెందు తుంది. ఎముకలు బలపడుతాయి.

క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిం దంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మానసిక ఉల్లాసంతోపాటు, చురు కుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.

క్యారమ్స్‌తో ఏకాగ్రత

ఏకాగ్రతతో లక్ష్యాన్ని ఎలా గురి పెట్టాలో నేర్పేదే క్యారమ్స్ విద్యార్థులు వేసవిలో ఇంటి దగ్గర నేర్చుకోవచ్చు.దీనితో చదువులో ఏకాగ్రత పెరుగుతుంది.

మెదడుకు పని చెప్పే చదరంగం

విద్యార్థుల మేథస్సుకు పనిచెప్పే ఆటల్లో చదరంగం ముఖ్యమైం ది. ఈ ఆటతో విద్యార్థికి సమయస్ఫూర్తి, ఆలోచ నాశక్తి సమస్యలను ఎలా పరిష్కరించాల్లో నేర్పుతుంది. ఇంటి వద్ద నే విద్యార్థి శిక్షకుడి సహా యంతో నేర్చుకోవచ్చు.




క్రికెట్‌తో చురుకుదనం

విద్యార్థులు అత్యంత ఇష్టపడే ఆటల్లో క్రికెట్ ఒకటి. సెలవు వచ్చిందంటే బ్యాట్, బంతితో నలుగురు పిల్లలు కలిసి గ్రౌండ్‌కు వెళ్తుంటారు. క్రికెట్‌తో విద్యార్థుల్లో మాన సిక ఉల్లాసంతోపాటు, చురుకుదనం పెరుగుతుంది. మానసిక ప్రశాంతత, స్నేహభావం పెంపొందుతుంది.



కంప్యూటర్ విద్య



నేటి పోటి ప్రపంచంలో కంప్యూటర్ విద్య తప్పనిసరిగా మారింది. దీని ప్రాధ్యాన్యాన్ని గుర్తించి వేసవిలో చిన్నారులకు కంప్యూటర్ పరిజ్ఞానం శిక్షణ పొందడానికి మంచి అవకాశం. ప్రతి ఒక్కరూ కంప్యూటర్‌పై పరిజ్ఞానం పెంచుకొనేందుకు కృషి చేస్తున్నారు.

ఇంగ్లీష్‌పై పట్టుకు ప్రయత్నం

ఉజ్వల భవిష్య త్‌కు ఇంగ్లీష్ భాష ప్రతి చిన్నారికి అవసరం. చదువుకు నే కోర్సు, పోటి పరీ క్షలో రాణించేందుకు అవసరమైన ఇంగ్లీష్ పరిజ్ఞానాన్ని పెంపొందిం చేందుకు వేసవిలో స్పోకెన్ ఇంగ్లీష్ నేర్చుకునేందుకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నారు.

డ్రాయింగ్ నేర్చుకోవడానికి చక్కని అవకాశం..

విద్యార్థులు వేసవి సెలవులను సద్వినియోగం చూసు కోవడానికి, తమలో సృజనాత్మకతను వెలికి తీసేందుకు ఉపయోగపడేవాటిలో పెయింటింగ్ ముఖ్యమైనదని ఉపాధ్యాయులు చెబుతుంటారు. విద్యా ర్థులు వాటిలో శిక్షణ తీసుకుని అద్భుతాలు సృష్టించడానికి చక్కని అవకాశం. విద్యార్థులు వివిధ రకాల బొమ్మలను తమారు చేయడంలో శిక్షణ పొందవచ్చు.



ఉరి వేసుకొని వివాహిత ఆత్మహత్య



శారద (ఫైల్)

కాల్వశ్రీరాంపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్యాల గ్రామపరిధిలోగల జగ్గయ్యపల్లెకు చెందిన శారద(23) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. కమా న్పూర్ మండలం జూలపల్లికి చెందిన శారదను ఏడుసంవత్సరాల క్రితం జగ్గయ్య పల్లెకు చెందిన ఉప్పుల అజయ్‌కుమార్‌కు ఇచ్చి వివాహం చేశారు. ఆరునెలలుగా శారద మానసిక పరిస్థితి బాగాలేకపోవ డంతో కరీంనగర్‌లోని వైద్యులకు చూపిం చారు. ఆదివారం రాత్రి ఇంటిముందు రేకుల షెడ్డులో శారద ఉరివేసుకుంది. సోమవారం ఉదయం భర్త అజయ్‌కుమార్ గమనించి శారద కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతురాలికి కుమారుడు ఉన్నాడు. శారద తండ్రి రామస్వామి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

ఓసీపీ-5లో ప్రమాదం: కాంట్రాక్టు కార్మికుడు మృతి

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): ఆర్జీ-1 ఏరియా ఓసీపీ-5 ప్రాజెక్టులోని 1సీమ్ కోల్‌బెంచ్‌లో సోమవారం ట్యాంకర్ బోల్తా పడిన ప్రమాదంలో అవుట్ సోర్సింగ్ సూపర్‌వైజర్, బీహార్‌కు చెందిన వికాస్ కుమార్(34) మృతి చెందాడు. వికాస్ కుమార్ వీసీ పటేల్ కంపెనీలో పని చేస్తున్నాడు. బ్లాస్టింగ్‌సెక్షన్‌లో పనిచేస్తున్న వికాస్‌కుమార్ ఎక్స్‌ప్లో జివ్ ట్యాంకర్‌పై ఎక్కివస్తున్నాడు. ట్యాంకర్ బోల్తా పడుతుండగా తప్పించుకునేందుకు వికాస్ కిందకు దూకాడు. ట్యాంకర్ వెనుక టైరు అతనిపై నుంచి వెళ్లడంతో మృతి చెందాడు. టుటౌన్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి ఆత్మహత్యాయత్నం

ఇల్లంతకుంట, మే 5 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన బాలసాని ఆశాలు(86) అనే వృద్ధుడు క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రామస్థుల వివరాల ప్రకారం.. ఆశాలు బస్టాండు సమీపంలో దుకాణం నడుపుతుంటాడు. వారం రోజుల క్రితం దుకాణంలోకి ఓ బాలిక వచ్చిన సందర్భంగా చిన్న వివాదం జరిగింది. దీంతో బాలిక ఇంటికి వెళ్లి తన అక్కకు విషయం తెలిపింది. ఆ తర్వాత వృద్ధుడు తనను దూషించాడని పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆశాలను పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కొంత సమయా నికి ఇంటికి పంపించారు. దీంతో మనస్థాపం చెందిన ఆశాలు ఆది వారం ఇంట్లో క్రిమిసంహారక మందుతాగి ఆత్మహత్యాయత్నానికి పాల్ప డ్డాడు. దీనిపై ఎస్సై శ్రీకాంత్‌గౌడ్‌ను వివరణ కోరగా ఫిర్యాదు రావ డంతో పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారణ జరిపామని తెలిపారు.

మహిళ అనుమానాస్పద మృతి

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కొత్తపల్లిలో ఉంటున్న సిద్ధిపేటలోని ప్రశాంత్‌నగర్‌కు చెందిన ఆలకుంట గౌరమ్మ(34) కొత్తపల్లి చెరువులో పడి మృతిచెందగా మృతిపై అనుమానాలున్నా యని మృతురాలి సోదరుడు కొత్తపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గౌరమ్మకు ఒక కూతురు ఉంది. ఆమెభర్త కొంతకాలం కిందట అనారోగ్యంతో మరణించాడు. అప్పటినుంచి తల్లి, కూతుళ్లు కూలీపని చేస్తూ జీవిస్తున్నారు. గౌరమ్మ అప్పడప్పుడు మద్యం తాగి కూతురుతో గొడవపడేది. ఈ క్రమంలోనే ఏడాదిన్నర కిందట గౌరమ్మ కూతురుకు చెప్పకుండా ఇంటి నుంచి వెళ్లిపోయింది. కొద్దిరోజుల కిందట గౌరమ్మ తన కూతురు వద్దకు మరో వ్యక్తితో వచ్చి తాము ఇద్దరం కలిసి ఉంటున్నట్లు చెప్పింది. కొత్తపల్లిలో పొన్న బాలాజీ అనేవ్యక్తితో గౌరమ్మ కలిసి ఉంటున్నట్లు మృతురాలి సోదరుడు తెలిపాడు. ఆదివారం సాయంత్రం బాలాజీ ఇంట్లో మద్యం తాగుతున్న సమయంలో గౌరమ్మ, మరోమహిళ గొడవపడినట్లు తెలిసిందని, బాలాజీ, మరోమహిళపై అనుమానం ఉందని మృతురాలి సోదరుడు ఫిర్యాదులో పేర్కొన్నాడు.

వడదెబ్బతో రైతు మృతి



గంగరాజం(ఫైల్)

మేడిపల్లి, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాలజిల్లా మేడిపల్లి మండల కేంద్రానికి చెందిన అత్తిని గంగరాజం(45) అనే రైతు వడదెబ్బతో సోమవారం తెల్లవారు జామున మృతి చెందాడు. గంగరాజం రెండు రోజుల నుంచి వరి కోత పనులు చేయిస్తున్నాడు. దీంతో ఆదివారం ఎండదెబ్బ తగిలి అస్వస్థతకు గురయ్యాడు. సోమవారం తెల్లావారుజామున గంగరాజం ఇంటిలో మృతిచెందాడు.

భార్యపై హత్యాయత్నం కేసులో భర్త రిమాండ్



నిందితుడి అరెస్టు చూపుతున్న ఎస్సై రాజన్న

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): భార్యను హత్య చేసేందుకు యత్నిం చిన కేసులో భర్తను కరీం నగర్ పోలీసులు జైలుకు తరలించారు. కరీంనగర్ వన్‌టౌన్ ఎస్సై రాజన్న వివ రాల ప్రకారం.. కరీంనగర్ సిఖ్‌వాడిలో గతనెల 18న తనభార్యను హత్య చేసేం దుకు యత్నించిన అన్నమ నేని కొమురయ్యను పోలీ సులు సోమవారం అరెస్టు చేశారు. సిఖ్‌వాడిలోని అమ్మ మెస్‌లో వంట పని చేస్తున్న భార్య వద్దకు వెళ్లిన ఆమె భర్త కొమురయ్య అక్కడే మెస్‌లో పొయ్యిపైన ఉన్న వేడికూరను ఆమెపై పోశాడు. దీంతో ఆమె ముఖం, ఛాతి, వీపుభాగాల్లో తీవ్రగాయాల య్యాయి. హోటల్ యజమాని వెంటనే 108లో ఆమెను ఆసుపత్రికి తరలించారు. చికిత్స అనంతరం బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదుతో కొమురయ్యపై కేసునమోదు చేశారు. భార్యపై కొమురయ్యకు అనుమానం ఉండేదని, గతంలో కొమురయ్యపై మహిళా పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసిందని, దీంతో భార్యపై కక్ష పెంచుకొని హత్య చేసేందుకు యత్నిం చాడని ఎస్సై తెలిపారు.

డీఈఈ సెట్-2025 నోటిఫికేషన్ విడుదల

తిమ్మాపూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ జిల్లావిద్యా శిక్షణా సంస్థ(డైట్)లలో, ప్రైవేటుకళాశాలలో రెండుసంవత్సరాల డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ (డీఎల్ఈడీ), డిప్లొమాఇన్ ప్రీ స్కూల్ ఎడ్యుకేషన్ (డీపీఎస్ఈ) మొదటి సంవత్సరం2025-26లో చేరుటకు నిర్వహించే డీఈఈసెట్2025 నోటిఫికేషన్ విడుదలైనట్లు ఎల్ఎండీ కాలనీలోగల డైట్‌కళాశాల ప్రిన్సిపాల్ శ్రీరాంమొండయ్య ఒక ప్రకట నలో తెలిపారు. ఈకోర్సులో చేరుటకు ఇంటర్‌లో అభ్యర్థులు కనీసం 50శాతంమార్కులు కల్గిఉండాలన్నారు. షెడ్యూల్ తెగలు, షెడ్యూలు కులాల, దివ్యాంగ అభ్యర్థులు కనీసం 45శాతంమార్కులు కలిగి ఉండాలని తెలిపారు. సెప్టెంబరు1, 2025నాటికి అభ్యర్థుల వయస్సు 17సంవత్సరాలు, గరిష్ట వయోపరిమితి లేదనితెలిపారు. దరఖా స్తులు ఆన్లైన్‌లోఈనెల15లోగా సమర్పించాలని తెలిపారు. ఈనెల25 న ఆన్‌లైన్ ప్రవేశపరీక్ష ఉంటుందని తెలిపారు. డీఎల్ఈడీ కోర్సు తెలుగు, ఉర్దూ, ఆంగ్లమాధ్యమాల్లో, డీపీఎస్ఈ కోర్సు మాత్రమే ఆంగ్లమాధ్యమంలో ఉంటుందని తెలిపారు. కోర్సును ఏ మాధ్యమం లో చేయదలిస్తే ఆమాధ్యమంలోనే ఆన్‌లైన్ ప్రవేశ పరీక్షరాయాలని తెలిపారు. ఆసక్తి, అర్హత ఉన్నవారు డీఈఈ సెట్-2025 వెబ్‌సైట్ deecet.cdse. telangana.gov.in ను సందర్శించాలని తెలిపారు.

జీవాల ఎరువు.. పంటలకు మేలు

- భూసారం పెరిగేందుకు దోహదం
- పొలాల్లో గొర్రెలు, మేకల మందలు
- కోళ్ల ఎరువుకు డిమాండ్



చెర్లబూత్కూర్ శివారులోని పొలంలో గొర్రెల మంద

కరీంనగర్ రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): కోతలు ముగియకముందే వానాకాలం సాగుకు అన్నదాతలు సన్నద్ధమవుతున్నారు. ముందుగా నేలను సారవంతం చేసేందుకు మూగజీవాల ఎరువును ఉపయోగిస్తు న్నారు. పొలాల్లో గడ్డిఉండగానే కొందరు మేకలు, గొర్రెల మందలు పెట్టి స్తుండగా, మరికొందరు కోతలు అయిపోయాక గడ్డిని చుట్టి పశుగ్రాసా నికి వినియోగిస్తుండగా, ఇంకొందరు తగలబెట్టి వర్షం కురిసిన తరువాత కలియ దున్నుతారు. ఆవులు, ఎద్దులు, గొర్రెలు, మేకలు, కోళ్ళ, కంపోస్టు, సేంద్రియఎరువులకు ప్రాధాన్యం ఇస్తున్నారు. రసాయన ఎరువుల విని యోగంతో భూసారం దెబ్బతినడం, పంట దిగుబడి తగ్గుతుండడంతో రైతులు జీవాల ఎరువుల వాడకంపై దృష్టిసారిస్తున్నారు.

రైతులు తమ పొలాల్లో గొర్రెలు, మేకల మందలు పెట్టిస్తున్నారు. గొర్రెలు మేకలమూత్రంలో పీహెచ్ విలువ 7.7ఉంటుందని వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. వీటిద్వారా చౌడుభూముల సార వంతంగా మారుతాయి. లీటర్‌మూత్రంలో 9నుంచి 13గ్రాముల నత్రజని 17నుంచి 20గ్రాముల పొటాషియం, పాస్పరస్ వంటివి ఉంటాయి. ఒక గొర్రెద్వారా ఒక రాత్రికి లీటర్‌మూత్రం 380నుంచి 540గ్రాముల వరకు పేడ లభిస్తుంది. ఒక్కరాత్రి పొలంలో ఉంచేందుకు రూ.1000నుంచి 1500 వరకు కాపరులు తీసుకుంటున్నారు. గొర్రెలు, మేకలమంద ద్వారా నత్ర జని, భాస్వరం, పొటాష్‌తోపాటు బాక్టీరియా, ప్రొటోజోవా, ఫంగి తదితర ఉపయోగకరమైన సూక్ష్మజీవులతో నేలసారవంతం అవుతుంది. పశువులు పేడ ట్రాక్టర్‌కు రూ.3,500నుంచి4వేల చొప్పున రైతులు కొనుగోలు చేస్తు న్నారు. సేంద్రియ ఎరువుల వాడకంతో భూసారం పెరుగుతుండటంతో రైతులు పశువుల ఎరువుల కోసం ఇప్పటి నుంచే అడ్వాన్స్‌లు ఇస్తున్నారు.

లారీల్లో కోళ్ల ఎరువు సరఫరా..

కొన్నేళ్లుగా కోళ్లఫారాల నుంచి వచ్చేవ్యర్థాలను ఎరువుగా ఉపయోగిం చుకునేందుకు రైతులు ఆసక్తి చూపుతున్నారు. వ్యాపారులు హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాలోని పౌల్ట్రీలనుంచి కోళ్ల వ్యర్థాలను సేకరిస్తున్నారు. గ్రామాల్లో తిరుగుతూ ఇప్పటి నుంచే రైతులకు లారీల చొప్పున సరఫరా చేస్తున్నారు. చిన్నలారీఅయితే రూ.20వేలు, పెద్దలారీ అయితే రూ.30వేల వరకు తీసుకుంటున్నారు.

కారు, ఆటో ఢీ..ఇద్దరికి గాయాలు

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): జగిత్యాల- కరీంనగర్ మార్గం లోని రాజారం సమీపంలో సోమవారం రాత్రి కారు, ఆటో ఢీకొన్న ఘట నలో ఒక్కరికి, అదే సమయంలో అక్కడే ద్విచక్రవాహనం ప్రమాదవశాత్తూ పడిపోవడంతో ద్విచక్రవాహనంపైగల మరో వ్యక్తికి గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా ఉన్నాయి. కరీంనగర్ వైపు నుంచి జగిత్యాల వెలుతున్న కారు, జగిత్యాల వైపు నుంచి నూకపల్లికి వస్తున్న ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో ముందు భాగం నుజ్జు కాగ డ్రైవర్ వేముల శివకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన స్థలం నుంచే వెలుతున్న మల్యా లకు చెందిన బోగ రాజశేఖర్ ద్విచక్రవాహనం ప్రమాదవశత్తూ పడిపోవడంతో రాజశే ఖర్‌కు గాయాలు అవడంతో గాయపడిన ఇద్దరినీ చికిత్సకోసం జగిత్యాల ఆసుపత్రికి తరలించారు. కాగా కారు డ్రైవర్ పరారీలో ఉండగా పోలీసులు కారును పోలీస్‌స్టేషన్‌కు తీసుకెళ్లి కేసు నమోదు చేశారు.

సెల్‌ఫోన్ షాపులో అగ్నిప్రమాదం

కరీంనగర్ క్రైం, మే 5 (ఆంధ్రజ్యోతి): కరీంనగర్ కోతిరాంపూర్ లోని ఒక సెల్‌ఫోన్ షాపులో సోమవారం రాత్రి అగ్నిప్రమాదం సంభవించింది. సమాచారం అందుకున్న అగ్నిమాపకశాఖ అధికా రులు, సిబ్బంది సంఘటనా స్థలానికి వెళ్లి మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఈ ప్రమాదంలో కొంత ఆస్తి నష్టం వాటిల్లిందని అగ్నిమాపకశాఖ అధికారులు తెలిపారు.

అంజన్న హుండీ ఆదాయం రూ. 1.07కోట్లు



కొండగట్టులో హుండీల్లోని డబ్బులను లెక్కిస్తున్న సిబ్బంది

మల్యాల, మే 5 (ఆంధ్రజ్యోతి): కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారారూ.1,07,67,134 ఆదాయం సమకూరి నట్లు ఈవోశ్రీకాంత్‌రావు తెలిపారు. 39రోజులకు గాను ఆలయంలోని 12హుండీలను విప్పి సోమవారం లెక్కించగా నగదుతోపాటు 134 విదేశీ కరెన్సీనోట్లు లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో పర్యవేక్షకులు సునీల్, చంద్ర శేఖర్, హరిహరనాథ్, ప్రధానార్చకులు రామ కృష్ణ, రఘు, అధికారులు, ఏఎస్సై రమణారెడ్డి పాల్గొన్నారు. కాగాఇన్నాళ్ల హుండీలలో వచ్చిన మిశ్రమ బంగారం, వెండిని తూకం వేయగా ప్రస్తుతం వాటిని తూకం వేయకుండానే సంచిలో సీజ్‌చేసి మళ్లీ హుండీలలోనే వేశారు. స్థానిక శాసనసభ్యుడు మేడిపల్లి సత్యంకు మంత్రి పదవి వచ్చేలా ఆంజనేయ స్వామి ఆశీర్వదించాలంటూ ఎమ్మెల్యే అభిమాని ఒకరు హుండీలో చీటీరాసివేశారు. సోమవారం హుం డీల లెక్కింపు సందర్భంగా రూ.500 నోటుకు చీటిపిన్ చేసి ఉండడం సిబ్బంది గమనించారు.

● హుండీల లెక్కింపులో వాగ్వాదం

కొండగట్టు ఆంజనేయస్వామి దేవస్థానం హుండీల లెక్కింపు సందర్భంగా ఆలయ ఈవో, లెక్కింపునకు వచ్చిన సేవకుడి మధ్య వాగ్వాదం జరిగినట్లు తెలిసింది. సేవకు వచ్చిన ఓ రిటైర్డ్ ఎంపీడీవో తదితరులతో సీసీ కెమెరాలో కని పించే విధంగా లెక్కించాలని ఈవో సూచించి అక్కడినుంచి వెళ్లిపోయారు. కాసేపటికి పర్య వేక్షణలో భాగంగా మళ్లీ ఈవో వచ్చేసరికి రిటైర్డ్ ఎంపీడీవో అలాగే ఉండడంతో వారి మధ్య వాగ్వాదానికి దారితీసింది. అనంతరం సేవకు వచ్చిన ఆ రిటైర్డ్‌ఉద్యోగిని అక్కడి నుంచి పంపివేయడంతో గొడవ సద్దుమణిగింది.

ఈదురుగాలులు..వర్షం

- విరిగిపడ్డ చెట్లు
- నిలిచిపోయిన విద్యుత్‌సరఫరా
- ఆముదాలపల్లి, మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన



కేశవపట్నంలో నేలకూలిన విద్యుత్ స్తంభం



వంకాయగూడెంలో జాతీయ రహదారిపై విరిగిపడ్డ చెట్టు

శంకరపట్నం/హుజూరాబాద్/గంగాధర, మే 5 (ఆంధ్రజ్యోతి): శంకరపట్నం మండలంలో సోమవారం రాత్రి గాలివాన బీభత్సం సృష్టించింది. బలమైన ఈదురుగాలులకు వంకాయగూడెం, తాడికల్ గ్రామాల్లో జాతీయరహదారిపై చెట్లు విరిగిపడ్డాయి. గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. ముత్తారం, మొలంగూర్ గ్రామాల్లో రెండురేకుల షెడ్లు గాలికి ఎగిరిపోయాయి. ఆముదాలపల్లిలో ఓవ్యక్తి ఇంటి ఎదుట ఉన్న తాడిచెట్టిపై పిడుగుపడి మంటలు అంటుకున్నాయి. ఆముదాలపల్లి మెట్‌పల్లి గ్రామాల్లో వడగళ్ల వాన కురిసింది.

హుజూరాబాద్, గంగాధర మండలాల్లో సైతం ఈదురుగాలులతో కూడిన చిరుజల్లులు కురిశాయి. అకాలవర్షంతో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడవకుండా కాపాడుకు నేందుకు రైతులు ఇబ్బందులుపడ్డారు. కొనుగోలు కేంద్రాల్లో సరిపడా టార్పాలిన్లు లేకపోవడంతో రైతులు కిరాయికి తెచ్చుకొని ధాన్యంపై కప్పారు. లక్ష్మీదేవిపల్లి, నాగిరెడ్డిపూర్, బూరుగుపల్లి గ్రామాల్లో గోలీకాయల సైజులో వడగళ్లు పడ్డాయి. రెండు గంటలపాటు విద్యుత్ అంతరాయం కలిగింది.

సుల్తానాబాద్: మండలంలోని కదంబాపూర్‌లో సోమవారం వీచిన గాలులకు అభినందన రైసుమిల్లుల గోదాములు ధ్వంసమయ్యాయి. గోదాముల రేకులు ధ్వంసం కాగా మరికొన్ని గాలిలో ఎగిరిపోయాయి. సత్యగణేష్ ఇండస్ట్రీస్ గోదాములు రైస్‌మిల్లు గోదాములు కూడా దెబ్బతిన్నాయి. సుద్దాల, కదంబాపూర్ గ్రామాలల్లో తోటల్లోని మామిడి కాయలు రాలిపోయాయి. ధాన్యం కొనుగోలు కేంద్రాలలో రైతులు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.



మార్కర్ నిటారుగా ఉన్నా కనిపించని నీడ

మిట్ట మధ్యాహ్నం నీడమాయం

కరీంనగర్ స్పోర్ట్స్, మే 5 (ఆంధ్రజ్యోతి): ఖగోళ అద్భుతంతో సోమవారం నుంచి ఈ నెల 14 వరకు మిట్ట మధ్యాహ్నం మనిషి నీడ రెండు నిమిషాల పాటు కనిపించదని ఆస్ట్రాయిడ్స్ సెర్చ్ క్యాంపెయిన్ కన్వీనర్ ఓదెలు కుమార్ తెలిపారు. మంగళవారం దీనికి సంబంధించిన వివరాలు వెల్లడించారు. మిట్ట మధ్యాహ్నం నీడ మాయమవడాన్ని జీరో షాడోగా వ్యవహరిస్తారన్నారు. సాధారణంగా నీడ మనిషికి ఏదో ఒక పక్క కనిపిస్తుందని, సోమవారం నుంచి 14 వరకు మాత్రం రాష్ట్రంలోని కొన్ని ప్రాంతాల్లో సూర్యకాంతి మన మీద లంబంగా పడి నీడ కనిపించదని వివరించారు.



ఓదెలు కుమార్

భూమి అక్షం 23.5 డిగ్రీలు వంపుగా ఉన్నందున సూర్యుడి చుట్టూ భ్రమణం చేసే సమయంలో సూర్యుడి స్థానం ఉత్తర-దక్షిణ దిశలో మారుతూ ఉంటుం ది. ఏటా రెండు సందర్భాల్లో కర్కాటక, మకర రేఖల మధ్య ఉన్న ప్రదేశాల్లో మధ్యాహ్నం సమయంలో సూర్యకిరణాలు భూమిపై సంపూర్ణ లంబంగా పడతాయి. దీంతో నిలువు వస్తువుల నీడ రెండు నిమిషాల వరకు పూర్తిగా మాయమవుతుందన్నారు. ఖగోళ శాస్త్రవేత్తలు సూర్యుడి కదలిక, స్థానాన్ని, అధ్య యనం చేసేందుకు జీరో షాడో ఉపకరిస్తుందని తెలిపారు.

ఎస్సెస్సీ మార్కుల పునఃపరిశీలనకు అవకాశం



రీ కౌంటింగ్, రీ వెరిఫికేషన్‌కు చాన్స్

వెల్గటూర్, మే 5 (ఆంధ్రజ్యోతి): పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో తక్కువ మార్కులు వచ్చాయని అనిపించిన విద్యార్థులు, ఫెయిలైన విద్యార్థులు మార్కులను పునఃపరిశీలన చేయడానికి ప్రభుత్వ పరీక్షల విభాగం అవకాశం కల్పించింది. చాలా మంది విద్యార్థులకు సరైన అవగాహన లేకపోవడం వలన పరీక్షల విభాగం కల్పించిన ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోలేకపోతున్నారు. ఉమ్మడి జిల్లాలో 38,498 మంది విద్యార్థులు పరీక్షకు హాజరు కాగా 37,667 మంది ఉత్తీర్ణులు అయ్యారు. 831 మంది విద్యార్థులు పరీక్షలో ఫెయిల్ అయ్యారు. ఈ నేపథ్యంలో విద్యార్థుల మార్కుల పునః పరిశీలన కోసం ఆంధ్రజ్యోతి అందిస్తున్న ప్రత్యేక కథనం..

జిల్లాల వారీగా విద్యార్థుల వివరాలు

జిల్లా	విద్యార్థులు	ఉత్తీర్ణులు	అనుత్తీర్ణులు
జగిత్యాల	11849	11636	213
కరీంనగర్	12508	12245	263
పెద్దపల్లి	7387	7157	230
రాజన్నసిరిసిల్ల	6754	6629	125

రీ కౌంటింగ్

విద్యార్థులు ఎన్ని సబ్జెక్టుల్లో మార్కులు రీ కౌంటింగ్ చేసుకోవాలని కోరుకుంటారో వాటికి ఒక్కో సబ్జెక్ట్‌కు రూ. 500 ఫీజు చెల్లించాలి.

దరఖాస్తుకు ఈనెల 15 వరకు గడువు

విద్యార్థులు ఈనెల 15లోగా నిర్ణీత రుసుము చెల్లించి మార్కుల లెక్కింపుతో పాటు జవాబు పత్రాల పునఃపరిశీలన చేయించుకోవడానికి దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. ఒక్కో సబ్జెక్ట్‌కు రూ.500లు ఎస్‌బీఐ బ్యాంక్‌లో చలానా రూపంలో చెల్లించాల్సి ఉంటుంది. తద్వారా జవాబు పత్రాలను పొందడంతో పాటు తక్కువ మార్కులు వచ్చినట్లు గుర్తిస్తే మళ్లీ అదనంగా మార్కులు పొందే అవకాశం ఉంటుంది. మార్కుల రీ కౌంటింగ్ దరఖాస్తులను ప్రభుత్వ పరీక్షల సంచాలకుల కార్యాలయం హైదరాబాద్‌కు నేరుగా కానీ లేదా పోస్టు ద్వారా గానీ పంపించవచ్చు.



దరఖాస్తులను పరీక్షల విభాగం వెబ్‌సైట్ నుంచి తీసుకొని వివరాలు నమోదు చేయాలి. విద్యార్థులకు సంబంధిత సబ్జెక్టులో వచ్చిన మార్కులను మాత్రమే లెక్కించి ఎక్కువ మార్కులు వస్తే సరి చేస్తారు. లేకుంటే మార్కులు అలాగే ఉంటాయి. జవాబు పత్రాలను చూసుకునే అవకాశం ఇందులో ఉండదు.

ఫీజుల వివరాలు

రీవెరిఫికేషన్ కోసం విద్యార్థులు ఒక్కో సబ్జెక్టుకు రూ.1000 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది. రీ వెరిఫికేషన్‌లో విద్యార్థులు తాము రాసిన జవాబు పత్రాల జిరాక్స్ కాపీలను పొందవచ్చు. దీని వలన తాము రాసిన సమాధానాలకు మార్కులు సరిగా పడ్డాయా? లేదా? మార్కులు ఎన్ని వచ్చాయో చూసుకునే అవకాశం ఉంటుంది. రీ వెరిఫికేషన్‌కు దరఖాస్తు చేసుకుంటే మళ్లీ మార్కుల రీకౌంటింగ్ కోసం దరఖాస్తు చేయాల్సిన అవసరం లేదు. రీ వెరిఫికేషన్‌కు హాల్ టికెట్ జిరాక్స్ కాపీ, కంప్యూటరైజ్డ్ ప్రింటెడ్ మెమోతో పాటు పూర్తి చేసిన దరఖాస్తులను సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయులకు మాత్రమే అందజేయాలి. ఎస్సెస్సీ బోర్డుకు నేరుగా కానీ, పోస్ట్ ద్వారా గానీ పంపిన దరఖాస్తులు ఆమోదించబడవు. ప్రధానోపాధ్యాయులు విద్యార్థుల వ్యక్తిగత చలాన్ ద్వారా ఫీజు చెల్లించాలి. రీ వెపికేషన్‌కు విద్యార్థులు ఈనెల 15 వరకు సంబంధిత ప్రధానోపాధ్యాయులకు దరఖాస్తులు సమర్పించాలని జగిత్యాల డీఈవో రాము సూచించారు.

వేములవాడలో భక్తుల రద్దీ

50 వేలకు పైగా తరలివచ్చిన భక్తులు



క్యూలైన్లో బారులు తీరిన భక్తులు

వేములవాడ కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): హర హర మహాదేవ.. శంభో శంకరా.. అనే నామస్మరణతో రాజన్న ఆలయం సోమవారం మారుమోగింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి తెల్లవారు జామున ఆలయ ధర్మగుండంలో పవిత్ర స్నానాలను ఆచరించి కల్యాణ కట్టలో తలనీలాలు సమర్పించుకున్నారు. రాజన్నకు ఎంతో ఇష్టమైన కోడెమొక్కు చెల్లించుకునేందుకు భక్తులు సుమారు నాలుగు గంటలు క్యూలైన్‌లో నిరీక్షించారు. స్వామివారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీబద్ది పోచమ్మ అమ్మవారికి బోనాలు చేసి డప్పుచప్పుళ్ల, శివసత్తుల నృత్యాలతో ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. సోమవారం కావడంతో 50 వేలకు పైగా భక్తులు తరలివచ్చినట్లు అంచ నా వేస్తున్నారు. రాజన్న ఆలయానికి వచ్చిన భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఉండేందుకు ఆలయ ఈవో వినోద్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏఈవోలు శ్రావణ్‌కుమార్, బ్రహ్మన్నగారి శ్రీనివాస్, అశోక్ కుమార్ సూపరిండెంట్ వరి నర్సయ్య, నరేందర్ టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రాజేందర్, గిరి, రాజే శంలు ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

రాజన్నను దర్శించుకున్న సింగర్ మానుకోట ప్రసాద్

వేములవాడ శ్రీరాజరాజేశ్వర స్వామి వారిని సింగర్ మానుకోట ప్రసాద్ దర్శించుకున్నట్లు ఆలయ అధికారులు తెలిపారు. ఫోక్ సింగర్ ప్రసాద్ రాజన్న ఆలయ చరిత్రపైన నూతన పాటను చిత్రీకరించి త్వరలో విడుదల చేస్తున్న సందర్భంగా రాజన్నను దర్శించుకున్నారు. స్వామి వారి ప్రత్యేక పూజల అనంతరం నాగిరెడ్డి మండపంలో అర్చకులు ఆశీర్వచనం గావించి రాజన్న ప్రసాదం అందజేశారు.



స్వామివారిని దర్శించుకుంటున్న భక్తులు

ధాన్యం కొనుగోలు చేయాలని రైతుల ఆందోళన

కోనరావుపేట, మే 5 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం స్పందించి ధాన్యం కొనుగోలు చేయాలని రైతులు సోమవారం ఆందోళనకు దిగారు. కోనరావుపేట మండలం వట్టిమల్ల గొల్లపల్లి గ్రామంలో రైతులు రోడ్డుపై బైఠాయించి ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని ధర్నాకు దిగారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ ఇప్పటికీ నెలరోజులు గడిచినా 2,000 కింటాళ్లు మాత్రమే తూకం వేశారని మరో 20 వేల క్వింటాళ్లు కొనుగోలు చేయాల్సి ఉందని అన్నారు. వర్షాకాలం దగ్గర పడుతున్న నేపథ్యంలో వెంటనే లారీలను తెప్పించి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొల్లపల్లి రైతులు పాల్గొన్నారు.



గొల్లపల్లి రైతులు

- రేవంత్‌రెడ్డికి ధైర్యం ఉంటే మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలి..
- తెలంగాణలో జరిగింది కుల గణన సర్వే... కేంద్రం చేసేది కుల గణన...
- రాజీవ్ రహదారి కాంట్రాక్టు గడువు పొడిగింపునకు యత్నిస్తే వ్యతిరేకిస్తా...
- తెలంగాణకు పదేళ్లలో కేంద్రం రూ.12లక్షల కోట్లు ఇచ్చింది...
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్

కులగణనతో బీసీలకు న్యాయం

గోదావరిఖని, మే 5 (ఆంధ్రజ్యోతి): కుల గణనతో బీసీలకు న్యాయం జరుగుతుందని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ పేర్కొన్నారు. సోమవారం ఎన్‌టీపీసీ గెస్ట్‌హౌస్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కేంద్రం చేపట్టనున్న కులగణనకు రాష్ట్రం చేసిన కుల గణన సర్వేకు పొంతన లేదన్నారు. రాష్ట్ర సర్వేలో కేవలం 50శాతం ప్రజలను మాత్రమే సర్వే చేశారన్నారు. కేంద్రం చేసేది కుల గణన అని, ప్రతి ఇంటికి, ప్రతి వ్యక్తి వద్దకు వెళ్లి వివరాలు సేకరిస్తారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీలకు రిజర్వేషన్ ప్రకటించామని చెబుతున్నా అందులో 10శాతం ముస్లింలకు ఇచ్చారని, ఇక బీసీలకు ప్రతిపాదించింది 32 శాతమేనన్నారు.



మావోయిస్టుల మెప్పు పొందేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌లు పోటీ పడుతున్నారని, రేవంత్ రెడ్డికి ధైర్యం ఉంటే రాష్ట్రంలో మావోయిస్టులపై నిషేధం ఎత్తివేయాలని సవాల్ చేశారు. కాంగ్రెస్ పార్టీ నే మావోయిస్టులను నిషేధించిందన్నారు. పదేళ్ల అధి కారంలో ఉన్న కేసీఆర్ ఆ పార్టీపై ఎందుకు నిషేధం ఎత్తివేసి చర్చలు జరుప లేదని ప్రశ్నించారు. మావోయిస్టు పార్టీతో మాటలు లేవు, మాట్లాడుకోవడాలు కూడా లేవని ఆయన తేల్చి చెప్పారు. వారు బేషరతుగా తుపాకులు వీడి లొంగిపోవాలన్నారు. రాష్ట్రంలో పీపుల్స్‌వార్ పార్టీ, మావోయిస్టులు అనేక విధ్వంసాలకు పాల్పడ్డారని, ఎంతో మంది ప్రజా ప్రతినిధులను, నాయకులను పొట్టన పెట్టుకున్నారన్నారు.

చంద్రబాబుపై అలిపిరిలో దాడి చేశారని, అప్పటి హోం మంత్రి మాధవరెడ్డిని పొట్టనపెట్టుకున్నారన్నారు. మహబూబ్‌నగర్ జిల్లాలో నర్సిరెడ్డి, నల్గొండ జిల్లాలో ఎమ్మెల్యే రాగ్యానాయక్, కరీంనగర్ జిల్లాలో మాజీ మంత్రి శ్రీపాదరావు, మల్హర్‌రావులను హత్య చేశారన్నారు. ఇప్పుడు ఆపరేషన్ కగార్ గురించి మాట్లాడుతున్న హరగోపాల్, వరవరరావులు అంత్యక్రియల్లో శవాలను మోయడం తప్ప ఏం సాధించారో చెప్పాలన్నారు. ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీలపై దాడి అంటూ దుష్ప్రచారం చేస్తున్నారని, ఆదివాసీలు వేరు, మావోయిస్టులు వేరు అన్నారు. ఆదివాసీలకు తుపాకి హింసతో సంబంధం లేదని, వారెన్నడూ ప్రభుత్వంపై తిరగబడలేదన్నా రు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి పదేళ్లలో రూ.12 లక్షల కోట్ల నిధులను ఇచ్చిందన్నారు. జాతీయ రహదారులకు 1.2 లక్షల కోట్లు, రైల్వే లైన్లు, రైల్వే స్టేషన్ల ఆధునీ కరణకు రూ.32వేల కోట్లు కేటాయించారని, ధాన్యం కొనుగోలుకే 1.5లక్షల కోట్లు ఇచ్చిందన్నారు.

రాజీవ్ రహదారిని అప్పగిస్తే నేషనల్ హైవేగా అభివృద్ధి చేస్తామని, ఇందుకు రాష్ట్ర ప్రభుత్వమే సంబంధిత కాంట్రాక్టర్‌ను ఒప్పించాల్సిన బాధ్యత ఉందన్నారు. రాజీవ్ రహదారి కాంట్రాక్టర్‌కు గడువును పొడిగించేందుకు కేంద్రం సహక రిస్తుందనేది అబద్ధమని, అలాంటి చర్యలను రాష్ట్రం ప్రతిపాదిస్తే ప్రజలు వ్యతి రేకిస్తారన్నారు. రామగుండంలో ఈఎస్ఐ ఆసుపత్రి గురించి తనకు సమాచారం లేదని, కరీంనగర్ కు మాత్రం ఈఎస్ఐ ఆసుపత్రి మంజూరైం దన్నారు. విలేకరుల సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంజీవరెడ్డి, నాయకులు కందుల సంధ్యారాణి, మేరుగు హన్మం తుగౌడ్, బల్మూరి వనిత, కోమళ్ల మహేష్, సోమారపు లావణ్య, ధర్మపురి, క్యాతం వెంకటరమణ, బల్మూరి అమరేందర్‌రావు పాల్గొన్నారు.



పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి సీతక్క

ఆదివాసీ ప్రాంతాల్లో శాంతియుత వాతావరణం నెలకొల్పాలి

- నా విప్లవ బంధం తెగిపోయినా ఆదివాసీ బంధం తెగిపోలేదు
- హింసను ప్రేరేపించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- రాహుల్ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన

ధర్మారం, మే 5 (ఆంధ్రజ్యోతి): విప్లవోద్యమంతో తనకు బంధాలు తెగిపోయినా, అదివాసీయుల పేగు బంధం తెగిపోలేదని, ఆదివాసీ ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతియుత వాతవరణం నెలకొల్పాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి సీతక్క అన్నారు. సోమవారం ధర్మారం మండల కేంద్రంలో పలు అభివృద్ధి పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ ఆపరేషన్ కగార్‌తో ఆదివాసీ బిడ్డలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, చట్టాన్ని ఎవరూ చేతిలోకి తీసుకోకుండా ఆదివాసి ప్రాంతాల్లో స్వేచ్ఛ, శాంతి వాతావరణం నెలకొల్పడం ఈ రాష్ట్రంతో పాటు దేశానికి అవసరమని తెలిపారు. కాంగ్రెస్ పార్టీకి సంక్షేమం - అభివృద్ధి రెండు కళ్లలాంటివని, సంక్షేమాన్ని మరువకుండా అభివృద్ధిని విస్మరించకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి రాష్ట్రాన్ని నడిపిస్తున్నారన్నారు. రాహుల్‌గాంధీ ఆలోచన విధానంతోనే దేశంలో కులగణన చేపట్టారని, అందుకు తెలంగాణ రాష్ట్రాన్ని ఆదర్శంగా తీసుకుని కేంద్ర ప్రభుత్వం ఆ దిశగా అడుగులు వేయడం సంతోషదాయకమని పేర్కొన్నారు.

పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణతోపాటు పేదలకు లబ్ధి జరిగే సంక్షేమ పథకాలను సీఎం రేవంత్‌రెడ్డి చేపడుతున్నారన్నారు. పదేళ్ల అధికారంలో ఉన్న బీఆర్ఎస్ నిరుద్యోగులను విస్మరించిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన సంవత్సరంలోపే 60 వేల ఉద్యోగాలు ఇచ్చి నిరుద్యోగులను ఆదుకుందన్నారు. ధర్మారం తెనుగువాడ నుంచి ఎండపల్లి ఎక్స్ రోడ్డు వరకు సీఆర్ఆర్ గ్రాంటు నుంచి 3 కోట్ల 20 లక్షల వ్యయంతో నిర్మించనున్న బీటీ రోడ్డు నిర్మాణానికి, ఖిలావనపర్తిలోని పోచమ్మ ఒర్రె వద్ద సీఆర్ఆర్ గ్రాంటు నుంచి కోటి 25 లక్షల వ్యయంతో పనులకు ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌తో కలిసి శంకుస్థాపస చేశారు.

ప్రభుత్వానికి ఆర్థిక పరమైన ఇబ్బందులు ఉన్నప్పటికి ఉచిత విద్యుత్, సన్నబియ్యం, ఉచిత బస్సు వంటి పథకాలు పేద ప్రజల కోసం చేపడుతున్నామన్నారు. అంగన్‌వాడీ టీచర్ల సమస్యలపై అవగాహన ఉందని, ఎన్నడూ లేని విధంగా అంగన్‌వాడీ బడులకు సెలవులు ఇచ్చిన ఘనత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికే దక్కుతుందని పేర్కొన్నారు. పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, ఎమ్మెల్యేలు విజయరమణారావు, రాజ్‌ఠాకూర్ సింగ్, కలెక్టర్ కోయా శ్రీహర్ష, తహసీల్దార్ వకీల్, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఏఈ రాజశేఖర్, అనుదీప్ అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. పాల్గొన్నారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క

పెగడపల్లి: పేదల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ధ్యేయమని పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క పేర్కొన్నారు. పెగడపల్లి మండలంలోని కీచులాటపల్లిలో సోమవారం ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్, పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్‌తో కలసి మంత్రి సీతక్క రూ.20 కోట్ల నిధులతో చేపట్టనున్న నియోజకవర్గ పరిధి అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి సీతక్క మాట్లాడుతూ నియోజకవర్గానికి రూ. 20 కోట్ల సీఆర్ఆర్ నిధులు కేటాయించి పనులకు శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. విడతల వారీగా మరో 30 కోట్లు మంజూరుకు మంత్రి సీతక్క హామీ ఇచ్చారు.

జిల్లా కేంద్రంలో జిల్లా పరిషత్ భవనం నిర్మాణానికి నిధులు మంజూరు చేయిస్తానన్నారు. అనంతరం మండలంలోని నార్సింహానిపేట గ్రామంలో తాండ్ర లక్ష్మి అనే పేదింటి మహిళ ఇంట్లో ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరఫరా చేసిన సన్న బియ్యం భోజనాన్ని మంత్రి సీతక్క, అధికారులు, గ్రామస్థులతో కలసి సహపంక్తి భోజనం చేశారు. ప్రభుత్వ విప్ లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ నియోజకవర్గంలో రోడ్లు, సాగు, తాగు నీటి అవసరాల కోసం ప్రత్యేక దృష్టి సారించి నిధులు కేటాయించాలని కోరారు. కార్యక్రమాలలో కలెక్టర్ సత్యప్రసాద్, అడిషనల్ కలెక్టర్ గౌతంరెడ్డి, డీఆర్‌డీవో రఘువరన్, డీపీవో మదన్‌మోహన్, డీడబ్ల్యుఓ నరేష్, పంచాయతీ రాజ్ సీఈ సమత, ఈఈ శ్రీనివాస్, ఎంపీడీవో శ్రీనివాస్ రెడ్డి, తహసీల్దార్ రవీందర్, మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



నార్సింహునిపేటలో లబ్దిదారు ఇంటిలో భోజనం చేస్తున్న మంత్రి సీతక్క, ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ

శ్వాస అందక ఉక్కిరిబిక్కిరి

- రోజురోజుకు పెరుగుతున్న ఆస్తమా బాధితులు
- నేడు ప్రపంచ ఆస్తమా దినోత్సవం

సుభాష్ నగర్, మే 5 (ఆంధ్రజ్యోతి): దీర్ఘకాలిక శ్వాస సంబంధ వ్యాధుల్లో ఆస్తమా ఒకటి. ఊపిరితిత్తుల్లోని వాయునాళాల్లో వివిధ కారణాలతో కండరాలు వాచిపోతాయి. దీంతో ఆ నాళాలు సన్నగా మారుతాయి. ఇది శ్వాసకు ఆటంకంగా మారుతుంది. ఏదైనా చిన్న పని చేసినా ఆయాసం వస్తుంది. ఆస్తమా తీవ్రంగా మారితే పరిణామాలు అత్యంత ప్రమాదకరంగా ఉంటాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ లెక్కల ప్రకారం ప్రపంచ వ్యాప్తంగా 262 మిలియన్ల మంది ఆస్తమాతో ఇబ్బంది పడుతున్నారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యుహెచ్‌వో) అంచనా ప్రకారం మనదేశంలో 3.4 కోట్ల మంది ఆస్తమాతో బాధపడుతున్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉబ్బసం గురించి అవగాహన పెంచేందుకు ప్రతి సంవత్సరం మే మొదటి మంగళవారం రోజు ప్రపంచ అస్తమా దినోత్స వాన్ని నిర్వహిస్తారు. డబ్ల్యుహెచ్‌వో ఆధ్వర్యంలో 1998 నుంచి ఆస్తమా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు.



ఈ సంవత్సరం థీమ్....

ప్రపంచ అస్తమా దినోత్సవం సందర్భంగా ప్రతి సంవత్సరం ఒక థీమ్ తీసుకుంటారు. ఈ సంవత్సరం 'ఇన్‌హెల్డ్ ట్రీటిమెంట్స్ అందరికి అందుబాటులో ఉండేలా చేయండి' అనే థీమ్‌ను తీసుకున్నారు. ఇన్‌హెల్డ్ కార్టికోస్టెరాయిడ్స్ వంటి అవసరమైన అస్తమా మందులపై అవగాహన కల్పించడం ఈ థీమ్ ఉద్దేశం.

చికిత్సతో ఆస్తమా తగ్గించవచ్చు


డాక్టర్ సుమలత, చెస్ట్ ఫిజీషియన్



అస్తమా వ్యాధి సరైన చికిత్సతో తగ్గిపోతుంది. ఆస్తమా ఉన్నవారు దుమ్ము ధూళికి ఉండాలి. బయటకు వెళ్లినప్పుడు తప్పనిసరిగా మాస్క్ ధరించాలి. పొగ తాగవద్దు. శీతల పానియాలు, అల్కాహాల్ సేవించవద్దు. వాతావరణంలో మార్పులు వచ్చినప్పుడు జాగ్రత్త వహించాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. అస్తమా లక్షణాలు కనిపించిన వెంటనే ఛాతి వ్యాధి నిపుణులను సంప్రదించాలి. వారి సలహాల మేరకు మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.

లక్షణాలు, నివారణ

ఆస్తమా లక్షణాలు క్రమక్రమంగా బయటపడతాయి. తరుచుగా అలసట, దీర్ఘకాలిక జలుబు, కాలనుకూలంగా అలెర్జీలు వంటివి ఈ వ్యాధి ప్రధాన లక్షణాలు. ఆస్తమా ఉన్న వారు వాయు కాలుష్యం, చల్లని గాలి, సువాసనలు మొదలైన వాటికి దూరంగా ఉండాలివ. సిగరెట్లు, కొవ్వొత్తులు, ధూపం, బాణసంచా నుంచి వచ్చే పొగను పీల్చొద్దు. జలుబు లేదా ఫ్లూ ఉన్న వ్యక్తులకు దూరంగా ఉండాలి. పరిసరాలను దుమ్ము ధూళి లేకుండా చూసుకోవాలి. మందులను క్రమం తప్పకుండా తీసుకోవాలి.



స్థానిక సంస్థల ఎన్నికలపై అయోమయం

(5వ పేజీ తరువాయి)

ఇబ్బందులు పడుతున్నారు. ప్రభుత్వం పంచాయతీ ఎన్నికలు నిర్వహించినట్లయితే తమపై భారం తగ్గుతుందని కార్యదర్శులు అభిప్రాయపడుతున్నారు.

సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నా..

ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపు ఏడాదిన్నర కావస్తున్నది. ఆర్థిక ఇబ్బందులతో సతమతం అవుతున్న ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను నెరవేర్చలేక పోతున్నది. ఇప్పటివరకు ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించగా, ఆరోగ్యశ్రీ ద్వారా ఐదు లక్షల నుంచి పది లక్షల రూపాయల వరకు ఉచిత వైద్య సౌకర్యాన్ని అందిస్తున్నది. రెండు లక్షల రూపాయల వరకు అర్హులైన రైతులకు రుణమాఫీ పథకాన్ని అమలు చేయగా, రైతు భరోసా పథకం కింద కొద్ది మందికి మాత్రమే పెట్టుబడి సాయాన్ని అందించింది. సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు 500 రూపాయల బోనస్ ఇస్తున్నది. ఇందిరమ్మ ఆత్మీయ భరోసా పథకం కింద ఏడాదికి 12వేల రూపాయల చొప్పున ఇస్తామన్న డబ్బులు ఇప్పటి వరకు ఇవ్వలేదు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా దరఖాస్తులను స్వీకరించింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఇండ్ల మంజూరుతో పాటు రేషన్ కార్డుల జారీ ప్రక్రియను ఆరంభించింది. అయితే ఈ పథకాలు పెద్దగా ప్రజల్లోకి వెళ్లడం లేదు. ఆయా పథకాలను అమలు చేయడంలో ప్రభుత్వం హైరానా పడుతున్నట్లుగా కనబడుతున్నది. ఈ క్రమంలో స్థానిక సంస్థల ఎన్నికల విషయమై ప్రభుత్వం మూడు మాసాలుగా ఏమీ మాట్లాడకపోవ డంతో అధికార పార్టీ నేతల్లో ఆందోళన నెలకొన్నది. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికారికంగా కాకపోయినా, పార్టీ పరంగా 42 శాతం రిజర్వేషన్లను కల్పిస్తామన్న ప్రభుత్వం, ఆ మేరకు ఎన్నికలను నిర్వహించాలని, లేకుంటే సంస్థాగతంగా పార్టీ ప్రతిష్ట మసకబారి పోయే ప్రమాదం ఉన్నదని అధికార కాంగ్రెస్ పార్టీకి చెందిన నాయకులు, కార్యకర్తలు అభిప్రాయపడు తున్నారు.

కష్టాలకు ఎదురొడ్డి.. కూతుళ్లను చదివించి...

ప్రభుత్వ ఉద్యోగాలు సాధించిన కూతుళ్లు

ఓదెల, మే 5(ఆంధ్రజ్యోతి): భర్త చనిపోయినా ఆమె కృంగిపోలేదు. కూలీ చేస్తూ ఇద్దరు కూతుళ్లను ఉన్నత చదువులు చదివించింది. తల్లి పడిన కష్టానికి ప్రతిఫలంగా ఇద్దరు కూతుళ్లు ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. ఓదెల మండలంలోని గుంపులకు చెందిన నిరుపేదలైన గట్టు రాములు, సునీత దంపతులకు ఇద్దరు కూతుళ్లు శ్రీలేఖ, సౌమ్య ఉన్నారు. కాగా ప్రమాదంలో తండ్రి రాములు మృతి చెందాడు. దీంతో గట్టు సునీతకు కష్టాలు వెంటాయి. అధైర్య పడకుండా ఉపాధి పనులు చేస్తూ ఇద్దరు కూతుళ్లను చదివించింది. ఇద్దరు కూతుళ్లు పట్టుదలతో చదివి ప్రభుత్వ ఉద్యోగాలు సాధించారు. శ్రీలేఖ యూనియన్ బ్యాంక్ అసిస్టెంట్ బ్రాంచ్ మేనేజర్ కాగా, సౌమ్య పంచాయతీరాజ్ అసి స్టెంట్ ఇంజనీర్‌గా ఉద్యోగాలు పొందారు. కూతుళ్లను ప్రయోజకులను చేసిన సునీతను సోమవారం గుంపులలో ఉపాధి ఫీల్డ్ అసి స్టెంట్‌తోపాటు కూలీలు ఘనంగా సన్మానిం చారు. తల్లి ఆత్మస్థైర్యం, విద్యార్థుల పట్టు దలపై గ్రామస్థులు హర్షం వ్యక్తం చేశారు.



గుంపులలో సునీతను సన్మానించిన ఉపాధి కూలీలు

కళోత్సవాలను విజయవంతం చేయాలి

కోల్‌సిటీటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆవిర్భావం సందర్భంగా సోమవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కళోత్సవాల పోస్టర్లను రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆవిష్కరించారు. తెలంగాణ ప్రభుత్వం భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో ఈనెల మూడో వారంలో గోదావరి కళా సంఘాల సమాఖ్య ఆవిర్భావ వేడుకలను నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, ప్రభుత్వ అధికారులు, కళా సంస్థల ప్రతినిధులు హాజరవుతున్నారని పేర్కొన్నారు. కళాకారులు, కళాభిమానులు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కనకం రమణయ్య, గద్దల శశిభూషణ్, నాగుల శ్రీనివాస్, వెంకటేశ్వరరావు, నూకల మొండి, మోహన్, బొంతల రాజేష్, ఓదెలు, పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్

అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



అభివృద్ధి పనులను పరిశీలిస్తున్న కమిషనర్

పెద్దపల్లిటౌన్, మే 5(ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని మున్సిపల్ కమిషర్ ఆకుల వెంకటేష్ సూచించారు. పట్టణంలో అన్ని వార్డుల్లో సిసి రోడ్లు, మురికి కాలువలు, కార్యాలయల ప్రహరీ అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కేటాయించిన టీఎఫ్ఐడీసీ రూ.5 కోట్లతో వార్డుల్లో ప్రజల సమస్యలు పరిష్కరిస్తున్నామన్నారు. గుత్తేదారులు పనుల్లో వేగం పెంచాలని, సీసీ రోడ్లు పూర్తయిన తరువాత 21 రోజులు రోడ్లపై మట్టితో కట్టలు కట్టి నీరు నిల్వ ఉంచాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అభివృద్ధి పనులు త్వరలోనే పూర్తి చేస్తామని, పట్టణ ప్రజలు మంచినీటిని వృథా చేయకుండా పొదుపుగా వాడుకోవాలన్నారు. మీ వార్డులో సమస్యలు ఉంటే మున్సిపల్ టోల్ ఫ్రీ నంబర్ 6303127484 కాల్ చేయాలని సూచించారు. అమర్ నగర్ నుండి ఆర్డీఓ ఆఫీస్ వరకు నిర్మిస్తున్న మంచినీటి పైపు లైన్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. మున్సిపల్ ఏఈ సతీష్, వర్క్ ఇన్స్‌పెక్టర్లు అనిల్, వాణి, వార్డు ఆఫీసర్లు శ్రీనివాస్, అరవింద్, యశ్వంత్, సంజీవ్ పాల్గొన్నారు.

డిప్లొమో కోర్సులో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): దుర్గాబాయిదేశ్‌ముఖ్ ప్రభుత్వ మహిళ టెక్నికల్ శిక్షణ సంస్థలో డిప్లొమా కోర్సులో ప్రవేశానికి అనాధ, నిరుపేద బాలికలు ఈనెల 20వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా సంక్షేమ అధికారి పి.వేణుగోపాల్‌రావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2025-2026విద్యా సంవత్సరానికి పదో తరగతి పూర్తి చేసిన అనాధ బాలికలు, పాక్షిక అనాద, నిరుపేద బాలికలకు అర్హత పరీక్ష లేకుండా నేరుగా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. 3సంవత్సరాలపాటు డిప్లొమా ఇన్ సివిల్‌ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్, డిప్లొమా ఇన్ కంప్యూటర్ ఇంజనీరింగ్, డిప్లొమా ఇన్ ఎలక్ట్రానిక్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని తెలిపారు. ఆసక్తి, అర్హత గల బాలికలు అన్ని ధ్రువీకరణ పత్రాలతోపాటు బోనఫైడ్ స్టడీ సర్టిఫికెట్, రెండు పాస్‌పోర్ట్ సైజు ఫోటోలతో పట్టణంలోని బాలరక్షా భవన్‌లో దరఖాస్తులు సమర్పించాలని. ఇతర వివరాలకు 9032427241నంబర్‌లో సంప్రదించాలని పేర్కొన్నారు.

పోస్టల్ ఉద్యోగికి సన్మానం



ఓదెల, మే 5 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ రాష్ట్ర సర్కిల్ నాల్గవ సమావేశం ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ ఆశయాలను ముందుకు తీసుకెళుతున్న కొలనూరు గ్రామానికి చెందిన పోస్టల్ ఉద్యోగి మాటూరి రత్నంను సన్మానించారు. రత్నం మాట్లాడుతూ అంబేద్కర్ మార్గంలో నడుస్తున్న తనను గుర్తించి సన్మానించడం సంతోషాన్ని ఇచ్చిందన్నారు. జాతీయ రాష్ట్ర నాయకులకు రత్నం కృతజ్ఞతలు తెలిపారు.

కులం పేరిట దూషించిన వారిపై చర్యలు తీసుకోవాలి

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): దళితురాలైన తనను కులం పేరిట దూషించిన వ్యక్తులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కాలనీకి చెందిన పర్లపల్లి సరోజ సోమవారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ సభ్యుడు కొంకటి లక్ష్మీనారాయణ, ఐజీ చంద్రశేఖర్‌రెడ్డిలకు ఫిర్యాదు చేసింది. గత నెల తనతో పాటు ఉన్న మరో యువతిని పొలంపల్లి నరేష్, మహేష్, మల్లేష్, వేణుగోపాల్‌లు కులం పేరిట దూషించి దాడి చేసినట్లు సరోజ పేర్కొన్నది. వారి నుంచి తనకు ప్రాణహాని ఉన్నదని, రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేసింది.

సమస్యలు పరిష్కరించాలని మంత్రికి వినతి

పెద్దపల్లి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌ల పదవీకాలం ముగిసినప్పటి నుంచి పంచాయతీ కార్యదర్శులు ఇబ్బందులు గురి కావడంతో పాటు అప్పులు పాలవుతున్నామని వెంటనే తమ సమస్యలు పరిష్కరించాలని తెలంగాణ రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కకు సోమవారం తెలంగాణ పంచాయతీ సెక్రటరీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షులు సంతోష్ వినతిపత్రం అందించారు. సంతోష్ మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలు పరిష్కరించేందుకు అప్పు చేసి పనులు చేయిస్తున్నామని, కొత్త యాప్‌ల ద్వారా ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే గ్రామ పంచాయతీల్లో ఓపిఎస్‌లుగా విధులు నిర్వహిస్తున్న వారిని రెగ్యులరైజ్ చేయాలని పేర్కొనట్లు తెలిపారు.



మంత్రి సీతక్కకు వినతిపత్రం అందిస్తున్న పంచాయతీ కార్యదర్శులు

ఉపాధిహామీ కూలీలకు సకాలంలో డబ్బులు జమచేయాలి

పాలకుర్తి,మే 5(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ కూలీలకు సకాలంలో డబ్బులు జమచేయాలని మక్కాన్‌సింగ్ సేవ సమితి చైర్‌పర్సన్ మనాలి ఠాకూర్ నిర్వాహకులకు సూచించారు. సోమవారం జయ్యారంలో ఉపాధిహామీ పనులు చేస్తున్న కూలీలకు ఓఆర్‌ఎస్ పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ తాగు నీరు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. మాజీ ఎంపీపీ గంగాధరి రమేష్‌గౌడ్,ఫీల్డ్ అసిస్టెంటు గంగాధరి గిరిగౌడ్,కేశిరెడ్డి భూంరెడ్డి,కార్యదర్శి పెండ్లి సాయి చరణ్‌రెడ్డి,కారోబార్ బద్దపురి శంకరయ్య,కూలీలు పాల్గొన్నారు.

క్రికెట్ విజేతలకు బహుమతులు ప్రదానం



టోర్నమెంట్ విజేతలకు ట్రోఫీ అందజేస్తున్న కర్ర సంజీవరెడ్డి

అంతర్గాం, మే 5(ఆంధ్రజ్యోతి): రామగుండం పట్టణంలోని జెన్‌కో గ్రౌండ్‌లో గత నెల 20న రామగుండం బీజేపీ ఇన్‌చార్జి కందుల సంధ్యారాణి పోచం ఆధ్వర్యంలో ప్రారంభమైన ఇమ్రాన్, నిస్సార్‌ల స్మారక క్రికెట్ పోటీలు సోమవారం ముగిశాయి. పోటీలో 32జట్లు పాల్గొన్నాయి. ఫైనల్‌లో రఘు, ప్రకాష్ టీమ్‌లు తలపడగా ప్రకాష్ టీమ్ విజేతగా నిలిచింది. విన్నర్ టీమ్‌కు రూ.25వేలు, రన్నర్ టీమ్‌కు రూ.15వేల బహుమతులను బీజేపీ జిల్లా అధ్యక్షుడు కర్ర సంజీవరెడ్డి బహుమతులు ప్రదానం చేశారు. సంజీవరెడ్డి మాట్లాడుతూ క్రీడలు శారీరక దృఢత్వంతో పాటు మానసిక ప్రశాంతతను చేకూరుస్తాయని, యువత క్రీడలను జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. నాయకులు మిట్టపల్లి సతీష్, క్యాతం వెంకట రమణ, పిడుగు కృష్ణ, కోమల మహేష్, ముస్కుల భాస్కర్‌రెడ్డి, పవన్, సంతోష్, నరహరి పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటుకు దాతలు ముందుకు రావాలి

సుల్తానాబాద్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రజల దాహార్తిని తీర్చడానికి దాతలు, వ్యాపార, వాణిజ్య, స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాల ఏర్పాటుకు ముందుకు రావాలని ఎస్ఐ శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు. బస్టాండ్ వద్ద ప్రయాణికుల కోసం పరిణీత వాటర్ ప్లాంట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సోమవారం ఎస్ఐ ప్రారంభించారు. నారగోని శ్రీనివాస్ గౌడ్, బైరగోని ప్రభాకర్, మేడి శ్రీధర్, రమేష్ పాల్గొన్నారు.

న్యాయమూర్తి మృతిపై సంతాపం

మంథని, మే 5 (ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ప్రియదర్శిని మృతిపై మంథని కోర్టులలో న్యాయమూర్తులు, న్యాయవాదులు సోమవారం మౌనం పాటించి సంతాపం తెలిపారు. కోర్టుల కార్యకలాపాలను నిలిపివేశారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రిన్సిపల్ సెషన్స్ జడ్జిగా జస్టిస్ ప్రియదర్శిని పని చేశారని గుర్తు చేసుకున్నారు. ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి నాగులారపు కీర్తిసింహ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కేవీఎల్ఎన్ హరిబాబు, ఉపాధ్యక్షుడు కేతిరెడ్డి రఘోత్తంరెడ్డి, ప్రధాన కార్యదర్శి సహేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

హాస్యం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుంది

కళ్యాణ్‌నగర్, మే 5(ఆంధ్రజ్యోతి): హాస్యం ఆరోగ్యాన్ని పెంపొందిస్తుందని స్మైల్ ప్లీజ్ అధ్యక్షుడు మేజిక్ రాజా అన్నారు. ప్రపంచ నవ్వుల దినోత్సవం సందర్భంగా దుర్గానగర్‌లో హాస్యవల్లరి కార్యక్రమాన్ని నిర్వహించారు. యాంత్రిక జీవనంలో మనిషికి మనిషికి మధ్య బంధాలు దూరమవుతున్నాయని, ఒకరికొకరు మాట్లాడుకోలేని పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. చంద్రపాల్, రాజమౌళి, శ్యాంసుందర్, దయానంద్‌గాంధీ, సంజయ్ కుమార్, విజయ్ కుమార్, గట్టయ్య, మల్లేషం, పీఎస్ అమరేందర్, రాజేశ్వర్ పాల్గొన్నారు.



సింగరేణి అనుబంధ సంస్థల ఏర్పాటుకు కృషి



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి విస్తరించి ఉన్న ఏరియాల్లో అనుబంధ సంస్థలు నెలకొల్పే దిశగా కృషి చేయనున్నట్లు ఐఎన్‌టీయూసీ సెక్రెటరీ జనరల్ జనక్ ప్రసాద్ తెలిపారు. సోమవారం యూనియన్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. సింగరేణిలోని యువ ఉద్యోగుల్లో సుమారు 500 మంది వరకు ఐటీ రంగంలో పని చేశారని, వారి విద్యార్హతకు అనుగుణంగా ఉపాధి కల్పించడంతో పాటు సంస్థ ప్రత్యేకంగా ఐటీ కంపెనీని ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. కోల్‌బెల్ట్ ఏరియాల్లో లైమ్ స్టోన్, లాటరైట్ నిల్వలు ఉన్నాయని, వాటిని వినియోగించుకుని రెండు సిమెంట్ పరిశ్రమలు ఏర్పాటు చేయడంపై దృష్టి సారించాలని తెలిపారు. కేవలం బొగ్గు ఉత్పత్తి చేయడమే కాకుండా సంస్థ వివిధ రంగాలకు విస్తరించడం ద్వారా లాభాలు గడించడంతోపాటు ఉపాధి అవకాశాలు లభించనున్నట్లు పేర్కొన్నారు. నైనీ బ్లాక్‌కు అనుబంధంగా 1600 మెగావాట్ల విద్యుత్ ప్లాంట్ ఏర్పాటుకు యాజమాన్యం సిద్ధం అవుతున్నట్లు తెలిపారు. కార్మికులకు ఇచ్చిన హామీల్లో సొంత ఇంటి పథకం, పెర్క్స్‌పై ఐటీ రీయంబర్స్‌కు కృషి చేస్తామని, కనీసం ఆరు కొత్త గనులు ప్రారంభించే దిశగా ఐఎన్‌టీయూసీ కృషి చేస్తున్నట్లు జనక్‌ప్రసాద్ తెలిపారు. ధర్మపురి, అక్రం, శంకర్‌నాయక్, దశరథం, అక్బర్‌అలీ, కొంగర రవీందర్, కిషన్‌నాయక్, మల్లికార్జున్, ఆకుల రాజయ్య పాల్గొన్నారు.

సింగరేణిలో సార్వత్రిక సమ్మె

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి సంస్థకు కార్మిక సంఘాల నాయకులు సోమవారం సమ్మె నోటీసు ఇచ్చారు. బొగ్గుపరిశ్రమ రక్షణ, నూతన బొగ్గు గనులు, 4లేబర్ కోడ్‌ల రద్దు, కనీస వేతనం రూ.26వేలు, సమాన పనికి సమాన వేతనం తదితర 17డిమాండ్ల పరిష్కారానికి ఈ నెల 20న సమ్మె చేసేందుకు కార్మిక సంఘాల ఐక్యవేదిక పిలుపునిచ్చింది. ఈ మేరకు హైదరాబాదు సింగరేణి భవన్‌లో సమ్మె నోటీసును డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ (సెంట్రల్) డీ శ్రీనివాసులుకు అందజేశారు. నాయకులు మాట్లాడుతూ సింగరేణిలో బొగ్గు బ్లాక్‌లను అమ్మకానికి కేంద్ర ప్రభుత్వం పూనుకుందని, కేంద్ర ప్రభుత్వానికి మద్దతుగా కొన్ని కార్మిక సంఘాలు వ్యవహరించడం అన్యాయమన్నారు. లాభాల్లో నడుస్తున్న సింగరేణి సంస్థలో నూతన భూగర్భ గనులకు అనుమతించాలని, సింగరేణిలో పనిచేస్తున్న 35వేల మంది కాంట్రాక్టు కార్మికులకు కోల్ ఇండియా వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మిక వర్గం మనుగడకు ముప్పు తెస్తున్న నాలుగు లేబర్ కోడ్‌లను మోదీ ప్రభుత్వం రద్దు చేయాలని పేర్కొన్నారు. సంఘాల నాయకులు రియాజ్ అహ్మద్, జే సీతారామయ్య, కామెర గట్టయ్య, జీ రాములు, మణిరాంసింగ్, ఏడుకొండలు, కృష్ణ, శ్రీనివాస్ పాల్గొన్నారు.

సార్వత్రిక సమ్మె నోటీస్‌ను కాంట్రాక్టు కార్మిక సంఘాల జేఏసీ నాయకులు ఆర్జీ-2 యాజమాన్యానికి అందజేశారు. సీఐటీయూ నాయకుడు ఉల్లి మొగిలి మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 20న దేశ వ్యాప్త సమ్మెకు అన్ని కార్మిక సంఘాలు పిలుపునిచ్చాయని జేఏసీ నాయకులు పేర్కొన్నారు. సింగరేణిలో పర్మినెంట్ కార్మికులతోపాటు కాంట్రాక్టు కార్మికులు సమ్మెలో పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఇఫ్టూ అధ్యక్షుడు విశ్వనాథ్, టీసీకేఎస్ అధ్యక్షుడు మద్దెల శ్రీనివాస్, ఏఐఎఫ్‌టీయూ వర్కింగ్ ప్రెసిడెంట్ రత్నకుమార్ ఉన్నారు.



సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాల నాయకులు

11 ఇంక్లయిన్ గనిపై అంబులెన్స్ ఏర్పాటు చేయాలి

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): సింగరేణి ఆర్జీ-1లోని జీడీకే 11 ఇంక్లయిన్ గనిపై 24గంటల అత్యవసర సేవలకు అంబులెన్స్‌ను వెంటనే ఏర్పాటు చేయాలని టీబీజీకేఎస్ పిట్ సెక్రెటరీ వాసర్ల జోసెఫ్ కోరారు. సోమవారం గని మేనేజర్‌కు వినతిపత్రం అందజేశారు. జోసెఫ్ మాట్లాడుతూ కార్మికులు ఎవరైనా అస్వస్థతకు గురైనపుడు, ప్రమాదం జరిగినపుడు అంబులెన్స్ వచ్చే వరకు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఆలస్యంగా ఆసుపత్రికి తరలించడం ద్వారా సరైన సమయంలో చికిత్స చేయలేకపోతున్నారన్నారు. కార్మికుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకొని వెంటనే గనిపై మూడు షిఫ్టులలో అంబులెన్స్ అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేయాలని కోరారు. టీబీజీకేఎస్ నాయకులు మోదంపల్లి రాజేశం, పల్లె సురేందర్, చంద్రు శ్రీనివాస్, అంబటి శ్రీనివాస్, ఆకారపు వంశీ, మీనుగు సురేష్, మాదాసు శ్రావణ్, కోటిలింగం పాల్గొన్నారు.

ఆర్జీ-1 ఏరియాలో త్వరలో జాబ్ మేళా

గోదావరిఖని, మే 5(ఆంధ్రజ్యోతి): గోదావరిఖని, పరిసర ప్రాంత నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించడానికి రామగుండం ఏరియా-1లో త్వరలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ఆర్జీ-1 జీఎం డీ లలిత్ కుమార్ అన్నారు. సోమవారం జీఎం అధ్యక్షతన సమావేశ హాలులో అధికారులతో సమావేశం నిర్వహించారు. జీఎం మాట్లాడుతూ జాబ్ మేళా కార్యక్రమానికి సంబంధించి చేపట్టవలసిన ప్రణాళికల గురించి చర్చించారు. హైదరాబాదుకు చెందిన 80నుండి 100 కంపెనీలు పాల్గొంటాయన్నారు. ఆసక్తి గల నిరుద్యోగ యువతీయువకులు 10వ తరగతి, పీజీ, సాంకేతిక విద్య, ఇతర ఉన్నత చదువులు చదివిన వారు రెండు పాస్ పోర్ట్ సైజ్ ఫోటోలు, సర్టిఫికెట్స్ జిరాక్స్ కాపీలతో ఆర్జీ-1 జీఓటీసీలో దరఖాస్తులను అందజేయలన్నారు. వివరాలకు 9491144252నంబర్‌లో సంప్రదించాలని కోరారు. ఎస్ఓటూ జీఎం గోపాల్‌సింగ్, డీజీఎం (పర్సనల్) కిరణ్ బాబు, ఆంజనేయులు, ఆంజనేయప్రసాద్, వరప్రసాద్, పాల్గొన్నారు.

మైదంబండలో ఫార్మర్ రిజిస్ట్రేషన్



రైతువేదికలో ఫార్మర్ రిజిస్ట్రేషన్ నమోదు చేస్తున్న అధికారులు

ముత్తారం, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రతి రైతుకి ఒక విశిష్టమైన 11 అంకెల యూనిక్ ఐడి నెంబర్ ఉండాలని మండల వ్యవసాయ అధికారి అనూష అన్నారు. కేంద్ర ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని డిజిటలైజేషన్ చేయడానికి ఈ ప్రాజెక్టు వచ్చిందని ఆమె తెలిపారు. భూమి ఉన్న ప్రతి రైతుకు ఫార్మర్ రిజిస్ట్రీ చేయనున్నామని, మండలంలోని మైదంబండ, ఖమ్మంపల్లి క్లస్టర్లో సోమవారం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించామని ఆమె తెలిపారు. ప్రతి రైతు ఆధార్, పట్టా పాస్‌బుక్‌తో తమ గ్రామ వ్యవసాయ అధికారిని సంప్రదించి యూనిక్ ఐడీని పొందాలని ఆమె సూచించారు. ఏఈఓ హారిక, శ్రీలేఖ రైతులు పాల్గొన్నారు.

ఆహ్లాదంగా వేసవి తరగతులు

ముత్తారం, మే 5 (ఆంధ్రజ్యోతి): పారుపల్లి అడవి శ్రీరాంపూర్ గ్రామాల్లో సోమవారం వేసవి తరగతులను ఏర్పాటు చేశారు. విద్యార్థుల తల్లి దండ్రులు స్వచ్ఛందంగా పిల్లలను సమ్మర్ క్యాంపులకు పంపిస్తున్నారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టి పిల్లలలో ఆత్మవిశ్వాసాన్ని పెంపొందిస్తున్నారని పిల్లల తల్లిదండ్రులు భావిస్తున్నారు.

తడి, పొడిచెత్తపై అవగాహన పెంచాలి

ఎలిగేడు, మే 5 (ఆంధ్రజ్యోతి): తడి, పొడిచెత్త వేరు చేయడంపై ప్రజలకు అవగాహన పెంచాలని జిల్లా పంచాయతీ అధికారి వీర బుచ్చయ్య అధికారులను ఆదేశించారు. సోమవారం నర్సాపూర్ గ్రామాన్ని సందర్శించారు. గ్రామ పంచాయతీ పరిధిలోని ఘన, ద్రవ, వ్యర్థ నిర్వహణ కేంద్రం పనితీరును పరిశీలించారు. గ్రామంలో చెత్తచెదారం, మురికి కాలువల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని, రికార్డుల నిర్వహణ సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. మండల పంచాయతీ అధికారి బేరి కిరణ్, మిషన్‌భగీరథ సహాయక ఇంజనీరు సంధ్య, పంచాయతీ కార్యదర్శి లలిత ఉన్నారు.

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

పెద్దపల్లి రూరల్, మే 5 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన ఉంటుందని పలు గ్రామాల్లో పెద్దపల్లి ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు విస్తృత ప్రచారం చేపట్టారు. కొత్తపల్లి గ్రామంలో సోమవారం అధ్యాపకులు అడ్మిషన్‌ల కోసం విద్యార్థులు, తల్లిదండ్రులతో మాట్లాడారు. ప్రభుత్వ కళాశాలలో చదవడం ద్వారా విద్యార్థులకు జరిగే ఉపయోగాల గురించి ప్రిన్సిపాల్ రవీందర్‌రెడ్డి వివరించారు. అధ్యాపకులు మల్లేశం, వేణు, శంకర్ పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి ప్రైవేట్ పాఠశాలు కొనసాగాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈవో చంద్రయ్య

కోల్‌సిటీటౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): రామగుండం మండలంలో ఉన్న ప్రైవేట్ పాఠశాలలు ప్రభుత్వ నిబంధనలకు లోబడి కొనసాగాలని మండల విద్యాధికారి గడ్డం చంద్రయ్య అన్నారు. సోమవారం గోదావరిఖని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల గాంధీపార్కులో ప్రైవేట్ పాఠశాలల సమావేశం నిర్వహించారు. చంద్రయ్య మాట్లాడుతూ, పాఠశాలలో పుస్తకాల విక్రయాలు చేయరాదని, మండల విద్యాశాఖ అడిగే వివరాలను సకాలంలో ఇవ్వాలన్నారు. ప్రైవేట్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు, క్లస్టర్ రిసోర్స్‌పర్సన్స్ రామ్‌కుమార్, వెంకటేష్, గౌస్ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



సమ్మేళనంలో పాల్గొన్న విద్యార్థులు

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): బేగంపేట జెడ్పీహెచ్ఎస్ పాఠశాలలో 2001-2002 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థుల అపూర్వ సమ్మేళనం సోమవారం జరిగింది. చదువుకునే సమయంలో జరిగిన తీపిజ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. హెచ్ఎం రామ్‌రెడ్డి, షేక్ మస్తాన్, రాధాకృష్ణ, మధుసూదన్ విద్యార్థులు వచ్చారు.

నేత్రదానం

రామగిరి, మే 5 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సెంటినరీ కాలనీకి చెందిన వేముల వసంత్ ఆత్మహత్యకు పాల్పడగా, ఆయన కుటుంబ సభ్యులను సదాశయ ఫౌండేషన్ సంప్రదించింది. ఈమేరకు సోమవారం ఎల్వీ ప్రసాద్ ఐబ్యాంక్ టెక్నీషియన్ ప్రదీప్ వసంత్ కంటి శుక్లాలను సేకరించారు. అభినందన పత్రాన్ని కుటుంబ సభ్యులకు అందజేశారు. సాన రామకృష్ణరెడ్డి, సలహాదారుడు నూక రమేశ్, జాతీయ ప్రధాన కార్యదర్శి లింగమూర్తి తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయానికి పుస్తకాల అందజేత

కోల్‌సిటీ టౌన్, మే 5 (ఆంధ్రజ్యోతి): గోదావరిఖని ప్రభుత్వ శాఖ గ్రంథాలయానికి హైదరాబాద్ చిక్కడపల్లి జీనియస్ పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు రఘు దేపాక రూ. 50 వేల విలుగ గల పోటీ పరీక్షల పుస్తకాలను అందజేశారు. రఘు దేపాక కుమారుడు, కూతురు అన్నప్రాసనను పురస్కరించుకొని గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువత కోసం పుస్తకాలను అందించారు. గ్రంథాలయ లైబ్రేరియన్ జీనియస్ పబ్లికేషన్స్ వ్యవస్థాపకులు రఘు దేపాకను సన్మానించారు. సుఖేష్‌గౌడ్, నదీమ్, ఎ విష్ణు, ధన్‌సింగ్ రాథోడ్, 30 మంది గ్రంథాలయ పాఠకులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి స్పందన

మంథని, మే 5 (ఆంధ్రజ్యోతి): మంథని వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో కరీంనగర్‌కు చెందిన మెడికవర్ ఆసుపత్రి సౌజన్యంతో ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో సోమవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరానికి వచ్చిన 120 మందికి డాక్టర్ దీక్షత్ పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి బీపీ, షుగర్, ఈసీజీ, 2డీ ఎక్కో పరీక్షలు నిర్వహించి మందులు రాశారు. అంకరి కుమార్, ప్రధాన కార్యదర్శి నాంపెల్లి రమేష్, రావికంటి మనోహర్ పాల్గొన్నారు.

స్థల పరిశీలన

పాలకుర్తి, మే 5 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్ కోయ శ్రీహర్ష ఆదేశాల మేరకు సోమవారం డీఆర్‌డీఓ కాళిందిని మండలంలో పెట్రోల్ బంక్ ఏర్పాటుకు అనుకూలంగా ఉన్న వేంనూర్, ధర్మారం అడ్డరోడ్డు వద్ద స్థలాలను పరిశీలించారు. డీపీయం రజని, ఏపీఎం సదానందం ఉన్నారు.

వ్యాపార సంస్థలకు సమ్మె నోటీసు

జ్యోతినగర్, మే 5(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక సమ్మెకు సంబంధించి సోమవారం సిఐటియు ఆధ్వర్యంలో ఎన్టీపీసీలోని వ్యాపార వాణిజ్య సంస్థల యజమానులకు సమ్మె నోటీసులు అందజేశారు. షాపింగ్ మాల్స్, పెట్రోల్ బంకులు, దుకాణాల యజమానులకు సీఐటియు జిల్లా కోశాధికారి ఎం.రామాచారి, ఏరియా కన్వీనర్ గీట్ల లక్ష్మారెడ్డి ఇతర నాయుకులు ఈనెల 20న బంద్ పాటించాలని సూచించారు.